


KADILIMCHE VAARTHA Telugu daily

# కదిలించే వార్త

తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

సంపుటి : 10 | సంచిక : 219 | శనివారం 25 ఏప్రిల్ 2026 | పేజీలు 8 | వెల : 05




## 'అకృత్యాల నుంచి ఆడబిడ్డలకు విముక్తి కల్పిస్తాం'

- బంగాల్ మహిళలకు ప్రధాని మోదీ హామీ?
- బంగాల్ మహిళా ఓటర్ల మద్దతు కోరిన ప్రధాని మోదీ
- "టీఎంసీ ఒక మహిళా వ్యతిరేక పార్టీ
- బీజేపీ మహిళా నేతృత్వంలోని అభివృద్ధి నమూనాపై పనిచేస్తుంది
- బీజేపీకి ఓటు వేస్తే ఆడబిడ్డలపై జరుగుతున్న అకృత్యాల నుంచి విముక్తి లభిస్తుందని వెల్లడి

# ప్రతీ కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దుతా..

- రాజకీయాల్లో నేరగాళ్లతో పోరాడాల్సిన పరిస్థితి వచ్చింది
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌ల శిక్షణా తరగతులకు హాజరైన సీఎం చంద్రబాబు
- సమకాలీన రాజకీయాలపై అవగాహన కల్పించుకోవాలని దిశానిర్దేశం
- కిల్లర్ పార్టీతో అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచన



**అమరావతి**

గొడ్డలి పార్టీ చేసే అరాచకాలను అనునిత్యం ప్రజలకు వివరిస్తూనే ఉండాలని సీఎం చంద్రబాబు నేతలకు దిశానిర్దేశం చేశారు. కిల్లర్ పార్టీతో అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇంఛార్జ్‌ల శిక్షణా తరగతులకు సీఎం హాజరయ్యారు. శిక్షణా తరగతులకు వచ్చిన క్లస్టర్ ఇన్చార్జులతో కాఫీ కబుర్లు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ సిద్ధాంతాలు, పార్టీ సంస్థాగత బలోపేతం ప్రభుత్వ పథకాలు వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రతీ కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దుతామని కేడర్ దాన్ని అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి - మిగతా3లో

# మూడు రోజుల పాటు స్పెషల్ అసెంబ్లీ




- మహిళా రిజర్వేషన్‌పై బిల్లు తిరస్కరణపై సీఎం చంద్రబాబు వార్
- మహిళా బిల్లుపై ఇండి కూటమిని అసెంబ్లీలో ఎండగట్టనున్న చంద్రబాబు
- విశాఖ-విజయవాడ-తిరుపతిలో స్త్రీ శక్తి సభలు
- 1996 నుంచి కాంగ్రెస్ అడ్డు పడుతుందని మహిళా బిల్లుపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

**అమరావతి**

మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఇండి కూటమి పక్షాల తీరును అసెంబ్లీ వేదికగా ఎండకట్టాల ని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఇందుకనుగుణం వచ్చే 10రోజుల్లో అసెంబ్లీని దాదాపు 3రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశపరచాలని భావిస్తున్నట్లు తెలిపారు. విశాఖ-విజయవాడ-తిరుపతి బహిరంగ సభల నిర్వహణతో పాటు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు సమావేశాలు నిర్వహిం చి మహిళల్ని చైతన్య పరిచే కార్యక్రమాల పై కార్యాచరణకు త్రిసభ్య - మిగతా3లో



## బీజేపీ చేరిన రాఘవ్ చడ్డా

- త్వరలో కేంద్ర మంత్రి పదవి దక్కే అవకాశం!
- 'ఆప్ పార్టీలోని 2/3వ వంతు ఎంపీలు బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు'
- రాఘవ్ చడ్డా కీలక వ్యాఖ్యలు



## బంగాల్ తొలిదశ ఎన్నికల్లో రికార్డు స్థాయి ఓటింగ్

- హర్షం వ్యక్తం చేసిన సీజేఐ
- ఎస్ఐఆర్ తర్వాత ఓటరు బాజితాలో పేర్ల చేరిక కోసం విచారణ కోరేవారికి ప్రాధాన్యతనిస్తూ విచారణ చేపట్టాలి
- అప్పీలేట్ ట్రిబ్యునళ్లకు సుప్రీంకోర్టు ఆదేశం

2

# వైద్య రంగంలో కృత్రిమ మేధ

- ఏపీలో ఏఐ ఆధారిత వైద్యసేవలతో ఎన్నో ప్రయోజనాలు
- మంత్రి సత్యకుమార్ వెల్లడి
- ఏపీ మెడ్‌టెక్ ఛాలెంజ్ విధానంలో ఆవిష్కరణలకు ప్రోత్సాహం
- పనితీరుపై అధ్యయనం, ఉత్తమ సంస్థల ఎంపికకు కసరత్తు
- అమరావతిలో త్వరలో సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించిన మంత్రి సత్యకుమార్




**అమరావతి**

వైద్య రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరుగుతోంది. వ్యాధుల నిర్ధారణ నుంచి చికిత్స వరకు అన్నింటికీ ఈ సాంకేతికతను వైద్యులు అందిపుచ్చుకుంటున్నారు. ఇప్పటికే పలు దేశాల్లో ఏఐ క్లినిక్‌లు సైతం అందుబాటులోకి రాగా ఇప్పుడు ఏపీలో సైతం ఈ తరహా వైద్య విధానాలను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు సాగుతున్నా యి. ఏపీలోని 18 ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందజేస్తున్న కృత్రిమ మేధ ఆధారిత వైద్య సేవలను సత్ఫలితాలను ఇస్తున్నాయని వైద్యారోగ్య, అదే విధంగా కుటుంబ సంక్షేమ శాఖ ఈ సందర్భంగా వెల్లడించింది. ఏపీ మెడ్‌టెక్ ఇన్నోవేషన్ ఛాలెంజ్?ను ప్రభుత్వం ప్రకటించిన అనంతరం 297 అంకుర సంస్థల నుంచి దరఖాస్తులు వచ్చాయని, క్యాథ్ కమిటీ మూడంచెల పరిశీలన తర్వాత మొత్తం 18 సంస్థలను వైద్యారోగ్య శాఖ ఎంపిక చేసిందని పేర్కొంది. పలు సంస్థలు డయాగ్నోస్టిక్ టూల్స్, పోర్టబుల్ పాయింట్ - మిగతా3లో




## డ్వాక్రా మహిళలకు గుడ్ న్యూస్

- 22 లక్షల మందికి 'అభయహస్తం' నిధులు
- అభయహస్తం నిధులు తిరిగి మహిళలకు అందించేలా కూటమి ప్రభుత్వ నిర్ణయం
- 22 లక్షల మంది డ్వాక్రా మహిళలకు భారీ ఊరట కల్పించేలా చర్యలు

**అమరావతి**

వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటుందని రూపాయి రూపాయి కూడబెట్టుకున్న డ్వాక్రా మహిళల సొమ్మును తిరిగి వారికే అందజేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయిం చింది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం దారి మళ్లించిన అభయహస్తం - మిగతా3లో



## డిసెంబర్ నుంచి అడ్డంకులు లేని టోలింగ్ వ్యవస్థ

- లాజిస్టిక్స్ ఖర్చును తగ్గించడానికి భారత్ మంచి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సి ఉంటుందని వెల్లడి
- నిబంధనలను పాటించని పక్షంలో ఉల్లంఘించిన వారికి ఇ-నోటీసులు జారీ



## ఇరాన్‌కు ప్రారంభమైన విమాన సర్వీసులు

- భారతీయులకు కీలక సూచన జారీ చేసిన ఇండియన్ ఎంబసీ
- భూ మార్గం ద్వారాగానీ, వాయు మార్గం ద్వారాగానీ ఇరాన్ ప్రయాణించడం శ్రేయస్కరం కాదు



## బంగాల్ తొలిదశ ఎన్నికల్లో బీజేపీకి 110 సీట్లు

- బంగాలీ మాట్లాడే వ్యక్తికే సీఎం బాధ్యతలు: అమిత్ షా
- తొలి దశ పోలింగ్‌లోనే 110కిపైగా స్థానాలు గెలుస్తామని అంచనా
- మే 5 తర్వాత బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్న విశ్వాసం
- భయం నుంచి భరోసా దిశగా ఓటర్ల ప్రయాణం ప్రారంభమైందని వ్యాఖ్య

# డ్వాక్రా మహిళలకు గుడ్ న్యూస్

-మొదటిపేజీ తరువాయి

నిధులను లబ్ధిదారులకు వెనక్కి ఇవ్వనుండడంతో 22 లక్షల మంది మహిళలకు భారీ ఊరట లభించనుంది. అభయహస్తం పింఛన్ పథకం కోసం డ్వాక్రా మహిళలు దాదాపు 12 ఏళ్లపాటు పొదుపు చేశారు. దాదాపు 22 లక్షల మంది మహిళలు జమ చేసిన మొత్తం రూ.1,194 కోట్లకు చేరింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వ వాటా మరో రూ.1,000 కోట్లు కలిపితే మొత్తం నిధులు రూ.2,194 కోట్లు అయ్యాయి. నెలనెలా పెరిగే ఈ నిధులను గత ప్రభుత్వం 2021లో ఇతర అవసరాలకు మళ్లించింది.



### డీఆర్డీఏ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

2019–24 మధ్య కాలంలో వైఎస్సార్సీపీ సర్కారు తాకట్టు పర్వం కొనసాగించిందని, అభయహస్తం నిధులనూ వదల్లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. మహిళలు జమ చేసుకున్న రూ.1,194 కోట్లతో పాటు ప్రభుత్వ వాటా రూ.1,000 కోట్లను కూడా దారి మళ్లించిందని, ఆ నిధులకు లెక్కాపత్రం లేదని ఆవేదన చెందారు. పింఛను అటుంచి తాము దాచుకున్న సొమ్మైనా ఇవ్వాలని డీఆర్డీఏ కార్యాలయాల చుట్టూ తిరిగినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదని వాపోయారు. బాధితుల విజ్ఞప్తి మేరకు కూటమి ప్రభుత్వం మహిళలు జమ చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని నిర్ణయించగా, ఆర్థిక శాఖ కూడా ఆమోదం తెలిపింది.

### పథకం నేపథ్యం

2009లో డ్వాక్రా సంఘాల్లోని 18 నుంచి 60 ఏళ్ల మహిళల కోసం అభయహస్తం పథకాన్ని ప్రారంభించారు. ఏడాదికి సభ్యురాలు రూ.365 చెల్లిస్తే, ప్రభుత్వం మరో రూ.365 జమ చేస్తుంది. 60 ఏళ్లు నిండిన తర్వాత నెలకు రూ.500 పింఛన్ ఇస్తారు. 2019 వరకు ఈ పథకం సజావుగా సాగింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులను చెల్లించలేదు.

### చట్ట సవరణతో నిధుల మళ్లింపు

ఈ పథకానికి ఫండ్ మేనేజర్గా ఉన్న ఎల్ఐసీ నుంచి నిధులు తీసుకోవడం కుదరకపోవడంతో గత ప్రభుత్వం చట్టాన్ని సవరించి ఎల్ఐసీ స్థానంలో సెర్ప్ను చేర్చింది. అనంతరం రూ.2,100 కోట్లను బదలాయించుకుంది. రెండేళ్లు వరుసగా సభ్యులు వాటా చెల్లించకపోతే సభ్యత్వం రద్దవుతుందన్న నిబంధనను అడ్డుపెట్టుకొని పథకాన్ని రద్దు చేసేందుకు కుట్ర చేసింది. 2021–22 నుంచి సభ్యుల నుంచి వాటా వసూలు నిలిపివేసింది.

### సెర్ప్ ఖాతాలో నిధులు మాయం

నిబంధనల ప్రకారం రెండేళ్ల తర్వాత సభ్యత్వం రద్దయిన వారికి జమ చేసిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలి. కానీ గత ప్రభుత్వం అమలు చేయలేదు. మరణించిన వారి కుటుంబాలకూ చెల్లించలేదు. ఎల్ఐసీ నుంచి తీసుకున్న రూ.2,194 కోట్లను దారి మళ్లించి కేవలం సెర్ప్ పీడీ ఖాతాలో ఉన్నట్లు చూపారు. కూటమి ప్రభుత్వం విచారణ చేయించగా అక్కడ ఒక్క రూపాయి కూడా లేనట్లు తేలింది.

మూడు వర్గాల లబ్ధిదారులు: 2021 నాటికి అభయహస్తం లబ్ధిదారులను మూడు వర్గాలుగా గుర్తించారు.

1. మరణించినవారు: గ్రామీణంలో 9,628 మంది, పట్టణంలో 847 మంది కలిపి మొత్తం 10,475 మంది. వీరు జమ చేసిన మొత్తం రూ.8.40 కోట్లు.
2. మూడేళ్లు వాటా చెల్లించనివారు: గ్రామీణంలో 8,73,959 మంది, పట్టణంలో 1,18,173 మంది కలిపి మొత్తం 9,92,132 మంది. వీరి పొదుపు రూ.449.69 కోట్లు.
3. కొనసాగుతున్న సభ్యులు: గ్రామీణంలో 11,51,808 మంది, పట్టణంలో 64,168 మంది కలిపి మొత్తం 12,15,976 మంది. వీరి పొదుపు రూ.736.51 కోట్లు. ఈ మొత్తాన్ని తిరిగి లబ్ధిదారులకు అందించే ప్రక్రియను కూటమి ప్రభుత్వం ప్రారంభించనుంది.

# ఫ్యాన్ కిందకు ఆమంచి

**ఒంగోలు :** వచ్చే ఎన్నికలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యలాంటివి. ఎట్టి పరిస్థితుల్లో గెలవాల్సిన ఎన్నికలు అవి. లేకుంటే పార్టీకి గడ్డు పరిస్థితులు తప్పవు. అందుకే సర్వశక్తులు ఒడ్డుతోంది ఆ పార్టీ. గెలుపు గుర్రాలను వెతికే పనిలో పడ్డారు జగన్మోహన్ రెడ్డి. గెలిచే ఛాన్స్ ఉన్నవారికి టికెట్లు ఇవ్వాలని భావిస్తున్నారు. అందుకే వివిధ కారణాలతో పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయిన వారికి తిరిగి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఓ నేతకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ప్రకాశం జిల్లా రాజకీయాలు ఒక మలుపు తిరిగినట్టే. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కు వైసీపీలోకి వచ్చేందుకు అనుమతి లభించినట్లు ప్రచారం నడుస్తోంది. అందుకే ఆయన చీరాల నియోజకవర్గంలో పర్యటనలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.ప్రకాశం జిల్లా రాజకీయాల్లో ఆమంచి కృష్ణమోహన్ ది ప్రత్యేక స్థానం. ఒక సాధారణ జడ్పిటిసిగా ఉన్న ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. మరోసారి ఇండిపెండెంట్గా పోటీ చేసి ప్రధాన పార్టీ అభ్యర్థులకు ఓడించి మరి ఎమ్మెల్యే అయ్యారు. ప్రధానంగా చీరాల నియోజకవర్గంలో ఆమంచి కృష్ణమోహన్ కు పట్టు ఎక్కువ. బలిజ సామాజిక వర్గానికి చెందిన ఆయన జడ్పిటిసిగా తన ప్రస్తానాన్ని ప్రారంభించారు. రోశయ్య ప్రోత్సాహంతో రాజకీయాల్లో రాణించగలిగారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వైసీపీలోకి.. వైసీపీ నుంచి టీడీపీలోకి.. అక్కడ నుంచి కాంగ్రెస్లో చేరారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించారు. షర్మిల పక్కన కనిపించే ఆమంచి కృష్ణమోహన్ ఇటీవల కాంగ్రెస్ కార్యకలాపాలకు దూరమయ్యారు. తన అనుచరులతో తరచూ చేరాలని నియోజకవర్గంలో పర్యటనలు చేస్తున్నారు.ప్రస్తుతం చీరాల నియోజకవర్గ ఇన్చార్జిగా కరణం బలరాం కుమారుడు వెంకటేష్ ఉన్నారు. అయితే వారు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో తనకంటూ పట్టు నిలుపుకుంటూ వచ్చారు ఆమంచి కృష్ణమోహన్. 2009లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో ఇండిపెండెంట్గా పోటీ చేసి గెలిచిన ఆయన తెలుగుదేశం పార్టీ అనుబంధ సభ్యుడిగా కొనసాగారు. 2019 ఎన్నికలకు ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే చంద్రబాబు అనూహ్యంగా కరణం బలరామును చీరాల అభ్యర్థిగా ప్రకటించారు. ఆ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా జగన్ ప్రభంజనం వీచింది. చీరాలలో మాత్రం టిడిపి అభ్యర్థి కరణం బలరాం గెలిచారు. గెలిచిన కొద్ది రోజులకే ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. అప్పటినుంచి కరణం బలరాం వర్సెస్ ఆమంచి కృష్ణమోహన్ అన్నట్టు పరిస్థితి మారింది. ఈ క్రమంలో ఆమంచి కృష్ణమోహన్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు.అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కరణం బలరాం చూపు మాత్రం పార్టీ వైపు ఉందన్న ప్రచారం ఉంది. అదే జరిగితే చీరాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ తప్పేలా లేదు. అందుకే అక్కడ పట్టున్న ఆమంచి కృష్ణమోహన్ ను పార్టీలోకి రప్పించి టికెట్ ఇవ్వాలన్న ఆలోచనలో జగన్ ఉన్నారు. అందుకే పార్టీకి దూరంగా ఉంటున్నారు ఆమంచి. త్వరలో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమన్న ప్రచారం సాగుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..



# కమలంలో జోష్...

**విజయవాడ :** జనసేన పార్టీని అన్ని రకాలుగా బలోపేతం చేయాలనే యాక్షన్ ప్లాన్ను పక్కాగా అమలు చేస్తున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఇప్పటికే చాలా వరకు పార్టీ కమిటీల ఏర్పాటును పూర్తి చేసిన జనసేన చీఫ్, సభ్యత్వ నమోదును స్పీడప్ చేశారు. 20 లక్షల సభ్యత్వాలు టార్గెట్గా సుదీర్ఘంగా డ్రైవ్ చేస్తున్నారు. ఇదే కాకుండా పార్టీ వాయిస్ను బలంగా వినిపించేందుకు లీడర్లను సిద్ధం చేశారు. ఇందుకోసం ఎంపిక చేసిన అధికార ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ఇటీవల జనసేన పార్టీపైనా, పవన్ కల్యాణ్ పైనా వస్తున్న కొన్ని విమర్శలను తిప్పికొట్టడంలో స్పోక్స్ పర్సన్స్ పూర్తి స్థాయిలో సక్సెస్ కావట్లేదన్న భావనతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొందరు నేతలు పార్టీ వేదికలపై, టీవీ డిబేట్లు, ప్రెస్మీట్లలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసి..తలనొప్పులు తెచ్చి పెడుతుండటంతో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అధికార ప్రతినిధులు పార్టీ వాయిస్ను బలంగా వినిపించాలని..అలా అని లైన్ దాటి మాట్లాడొద్దని డైరెక్షన్స్ ఇచ్చారు పవన్.పార్టీ అధికార ప్రతినిధులకు రెండు రోజుల పాటు ట్రైనింగ్ వర్క్షాప్ నిర్వహించింది జనసేన. పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికార ప్రతినిధులకు వివిధ అంశాలపై ఈ శిక్షణ తరగతులు పెట్టారు. ముఖ్యంగా మీడియా చర్చల్లో బాధ్యతాయుతంగా, సమర్థంగా పాల్గొనే నైపుణ్యాలను ఈ రెండు రోజుల వారికి శిక్షణ ఇచ్చారు. ఇకపై రెగ్యులర్గా వీరంతా పార్టీ వాయిస్ను బలంగా వినిపించనున్నారు. ఇటీవలే పార్టీ కార్యవర్గ సమావేశంలో పవన్ కల్యాణ్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తాను ఒక్కడినే మాట్లాడాలా? మీరంతా ఉండి ఎందుకు అని ప్రశ్నించడంతో కొందరు ఎమ్మెల్యేలు ఇప్పటికే యాక్టివ్ అయ్యారు. అవసరం అయ్యినప్పుడల్లా మాట్లాడుతున్నారు. అయితే చర్చా వేదికల్లోనూ పార్టీ వాయిస్ను వినిపించేలా అధికార ప్రతినిధులకు హితబోధ చేశారు.మాట పదునుగా ఉండాలి. బూతులు మాట్లాడొద్దు. మహిళల జోలికి అసలే వెళ్లొద్దు. వ్యక్తిగత అంశాల ముచ్చటే వద్దు. సబ్జెక్ట్ బేస్డ్గా కౌంటర్ ఉండాలి. పిన్ టు పిన్ ఇచ్చిపడేయాలంతే అంటూ స్పోక్స్ పర్సన్స్కు జనసేన శిక్షణ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇచ్చారు. అనవసర విషయాలను ప్రస్తావించి ఇరకాటంలో పడొద్దని..లైన్ దాటి మాట్లాడితే ప్రజల్లో చులకన అవుతామన్న విషయాన్ని



మర్చిపోవద్దన్నారు. అలాగని విపక్షం ఏ విమర్శ చేసినా తమకేం పట్టనట్లు ఉంటే కుదరదని తేల్చి చెప్పారు.అధికార ప్రతినిధులు అంటే పార్టీ తరఫున, అధినేత తరఫున గళం వినిపించే బాధ్యత మీపై ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దని గుర్తు చేశారు. ఇలా జనసేన అధికార ప్రతినిధులకు వివిధ అంశాలపై డైరెక్షన్స్ ఇచ్చారు. మీడియా చర్చల్లో బాధ్యతాయుతంగా, సమర్థంగా పాల్గొనేలా స్కిల్స్ పెంచుకోవాలని..పార్టీ భావజాలాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పుకొచ్చారు. ఇలా అధికార ప్రతినిధులకు శిక్షణ ఇచ్చి మరీ జోష్ పెంచడం వెనుక సేనాని వ్యూహం ఏంటన్నది ఆసక్తికరంగా మారింది.

## ప్రతీ కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దుతా..

-మొదటిపేజీ తరువాయి

దిశానిర్దేశం చేశారు. సమకాలీన రాజకీయాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించుకోవాలని అధికారం కోల్పోయిన తర్వాత కూడా వైఎస్సార్సీపీ చేస్తున్న అరాచకాలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వివరించారు. ప్రస్తుత పరిణామాల్లో క్రిమినల్స్తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి వచ్చిందనే విషయాన్ని నిరంతరం గుర్తుపెట్టుకోవాలని అలానే ఇటీవల జరిగిన దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు బరితెగింపు వంటి అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తావించారు.

## వైద్య రంగంలో కృత్రిమ మేధ

-మొదటిపేజీ తరువాయి

ఆఫ్ కేర్, స్మార్ట్ మానిటరింగ్ అండ్ వేరబుల్స్, రిమోట్ కేర్ టెలిమెడిసిన్ కేటగిరీల్లో సేవలు అందిస్తున్నాయని తెలిపింది.

### అంకుర సంస్థల ద్వారా ఆధునిక వైద్య సేవలు

అదే విధంగా ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన అంకుర సంస్థలను వైద్య ఆరోగ్య శాఖ త్వరలో ఎంపిక చేయనుంది. మొత్తం నాలుగు కేటగిరీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వచ్చేటటువంటి 12 అంకుర సంస్థలకు రూ.5 లక్షలు, రూ. 3 లక్షలు, రూ. 2 లక్షలు చొప్పున ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుంది. అత్యుత్తమ ప్రతిభను చూపించే ఒక అంకుర సంస్థకు రూ. కోటి విలువైనటువంటి వర్క్ ఆర్డర్ ఇవ్వనుంది. ఈ అంకుర సంస్థ ద్వారా రోగులకు ఆధునిక వైద్య సేవలను అందజేస్తారు.

### 70 శాతం సమయం ఆదా

అంతేకాకుండా అంకుర సంస్థల ద్వారా ఫిబ్రవరి, మార్చి నెలల్లో 37 రోజులు వ్యవధిలో 12,677 మంది రోగులకు వైద్యుల సమక్షంలో సేవలను అందించారు. విశాఖపట్నం, అనంతపురం, గుంటూరు, పాడేరు, కర్నూలు, కాకినాడ, విజయవాడ, అనంతపురం, తిరుపతి మొదలైన ఆసుపత్రుల్లో ఏఐ ఆధారిత వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ పద్ధతిలో టీబీ, క్యాటరాక్ట్, సర్వైకల్ క్యాన్సర్, నవజాత శిశువుల్లో శ్వాస ఇబ్బందులు మొదలైన ఆరోగ్య సమస్యలను గుర్తించారు. మొత్తం 2,100 మంది పేషెంట్స్?తో వైద్యులు ఏఐ స్క్రైబ్ ద్వారా మాట్లాడి 70 శాతం సమయాన్ని ఆదా చేశారు.

### వెల్లడించిన మంత్రి సత్యకుమార్

భారతదేశంలోనే తొలిసారిగా ఏకకాలంలో 18 అంకుర సంస్థల ద్వారా ఏపీలో వైద్యసేవలను రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందుకు ప్రధానంగా సీఎం చంద్రబాబు విజన్ వల్లే ఇది సాధ్యమైందని మంత్రి అన్నారు. ఈ ఆవిష్కరణల ద్వారా వచ్చినటువంటి ఫలితాలను తెలియజేసినందుకు అమరావతిలో త్వరలో సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. అదే విధంగా నేషనల్ హెల్త్ అథారిటీ, ఇ- హెల్త్ స్టార్టప్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్, ఐఐటీ కాన్పూర్?తో పాటుగా కేంద్ర ప్రభుత్వం సంస్థలను సదస్సుకు ఆహ్వానించనున్నట్లు మంత్రి సత్యకుమార్ తెలియజేశారు.

### గ్రామీణ ప్రాంతాలకు చేరువ

ఏఐ ఆధారిత నిర్ధారణ పద్ధతులు, రిమోట్ మానిటరింగ్, టెలీమెడిసిన్, ప్రజారోగ్య సమాచార విశ్లేషణతో గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య సేవలను చేరువ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏపీ డిజిటల్ హెల్త్ మిషన్ ద్వారా వ్యాధుల పై ముందస్తు హెచ్చరికలతో పాటు డేటా ఆధారిత ప్రణాళికలు, ఆసుపత్రుల మధ్య వైద్య సేవల్లో సమన్వయం దిశగా చొరవ చూపుతోంది.

## మూడు రోజుల పాటు స్పెషల్ అసెంబ్లీ

-మొదటిపేజీ తరువాయి

కమిటీని నియమిం చారు. కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్సు నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై స్పష్టమైన రాజకీయ దిశా నిర్దేశం ఇచ్చారు. పార్లమెంట్లో ఈ బిల్లును అడ్డుకున్న ఇండి కూటమి పక్షాల వైఖరిని ప్రజల ముందుంచాలని ఆయన సూచించారు. మహిళలకు జరిగిన అన్యాయాన్ని ప్రతి ఇంటికి చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని నేతలను ఆదేశించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్లు చర్చల్లో పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాలతో పాటు త్వరలో 3 ప్రాంతాల్లో సభలు నిర్వహించాలని సీఎం అన్నారు.

విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో కూటమి పక్షాల ఆధ్వర్యంలో బహిరంగ సభలు పెట్టాలని నిర్ణయించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని చంద్రబాబు విమర్శించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోదీ ప్రభుత్వం చట్టం చేశారని గుర్తుచేశారు. మహిళ రిజర్వేషన్ బిల్లుపై ఇండియా కూటమి వైఖరిని ప్రజలకు ముఖ్యంగా మహిళలకు వివరించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు మాధవ్, జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్?లతో కమిటీ ఏర్పాటు చేశారు.

“స్త్రీ శక్తి” : మహిళా హక్కుల విషయంలో ఎన్డీఏ కట్టుబాటును పునరుద్ఘాటించిన చంద్రబాబు, కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పార్టీలు అడ్డంకులు సృష్టించాయని విమర్శించారు. 1996 నుంచి మహిళా బిల్లును నిలిపివేస్తూ వచ్చిన ధోరణిని ప్రజలకు వివరించాలని కోరారు. ప్రధాని మోదీ నాయకత్వంలో వచ్చిన చట్టాన్ని కూడా అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని గుర్తుచేశారు. డీలిమిటేషన్ పేరుతో తప్పుదారి పట్టించే ప్రయత్నాలను బహిర్గతం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి గ్రామ స్థాయి వరకు నిరసనలతో రాజకీయ వేడి పెంచాలని సీఎం పిలుపునిచ్చారు. “స్త్రీ శక్తి” పేరుతో ప్రత్యేక సదస్సులు నిర్వహించి మహిళల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. టీడీపీ--జనసేన--బీజేపీ నేతలు సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టి బలమైన సందేశం ఇవ్వాలని అన్నారు. ఈ నెల 30లోగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో ఆందోళనలు పూర్తి చేయాలని గడువు నిర్ధేశించారు.

### రాజకీయ సమరానికి సిద్ధమవ్వాలి

మహిళల సాధికారతలో ఎన్డీఏ పాత్రను ప్రజలకు స్పష్టంగా తెలియచేయాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం నుంచి మహిళా విద్యాభివృద్ధి వరకు తమ ప్రభుత్వాల కృషిని గుర్తు చేయాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని కేంద్ర హామీలను కూడా వివరించాలని చెప్పారు. చివరగా, మహిళా ఓటును కేంద్రంగా చేసుకుని రాజకీయ సమరానికి సిద్ధమవ్వాలని నేతలకు పిలుపునిచ్చారు. ఇప్పటికే నిడదవోలులో నిరసన ర్యాలీలో పాల్గొన్న విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ప్రతీ ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో మీడియా సమావేశం పెట్టి ఈ అంశాన్ని వివరిస్తే బాగుంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ అభిప్రాయపడ్డారు.

## వలంటీర్ల వ్యవస్థ ముగింపేనా...

**విశాఖపట్టణం:** వాలంటీర్ వ్యవస్థ.. వైసీపీ హయాంలో పెన్షన్ల పంపిణీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేందుకు వైసీపీ ఏర్పాటు చేసిన ఔట్ సోర్సింగ్ వ్యవస్థ. ఈ వాలంటీర్ సిస్టమ్ను వైసీపీ దుర్వినియోగం చేసిందన్నదానిపైనే ఏపీ ఎన్నికల వేళ పెద్దఎత్తున చర్చ జరిగింది. వాలంటీర్ల సెంట్రిక్గానే ఎలక్షన్ ప్రచారం నడిచింది. ఈ నేపథ్యంలో కూటమి వాలంటీర్లపై అప్పట్లోనే సీరియస్ కామెంట్స్ చేసింది. ఇక పవర్లోకి వచ్చాక వాలంటీర్ల ముచ్చటే తీయకుండా సున్నితంగా ఆ సిస్టమ్కు చెక్ పెట్టగలిగింది.వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలని అప్పట్లో సర్పంచ్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరగా క్లియర్ కట్ క్లారిటీ ఇచ్చేశారాయన. అసలు వాళ్లు ఉద్యోగంలో ఉంటే రద్దు చేయవచ్చని, కానీ అసలు వ్యవస్థలోనే లేరని చెప్పేశారు. దీంతో కూటమి సర్కార్ వాలంటీర్ వ్యవస్థకు మంగళం పాడినట్లేనని విమర్శించింది వైసీపీ. తాము లక్షల మంది వాలంటీర్లను పెట్టి ప్రజలకు ప్రభుత్వ సేవలను దగ్గర చేస్తే కూటమి సర్కార్ ప్రజలను ఇబ్బంది పెడుతోందని అటాక్ చేసింది. అయితే ఇప్పుడు వైసీపీ కూడా వాలంటీర్ వ్యవస్థపై యూటర్న్ తీసుకుంది. అప్పుడు జరిగిన డ్యామేజ్ను కవర్ చేసుకునేందుకు క్యాడర్ మనసు గెలుచుకునేందుకు సరికొత్త స్టేట్మెంట్స్తో ఇండికేషన్స్ పంపిస్తోంది.గత ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమికి వాలంటీర్ వ్యవస్థే కారణమని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఈ మధ్య కామెంట్స్ చేశారు. పాలనలో ప్రజాప్రతినిధులకు, నాయకులకు ఎటువంటి ప్రాధాన్యం లేకపోవడంతో ప్రజలకు దూరమై, ఓడిపోయామన్నా రు. వాలంటీర్ వ్యవస్థతో ప్రజలకు మేలు జరిగి, వైసీపీకి నష్టం జరిగిందన్నారు గుడివాడ. ఈ సమస్యను అధినేత జగన్ కూడా గుర్తించారని, మరోసారి ఇటువంటి పొరపాటు జరక్కుండా చూసుకుంటారని చెప్పారు. 2029 ఎన్నికల తర్వాత మళ్లీ వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చే ప్రసక్తే ఉండదని, అధినేత జగన్ కూడా ఈ విషయమై స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారని మాజీ మంత్రి తేల్చిచెప్పారు.

# అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పూజలు అభిషేకాలు

## - కుంకుమార్చన,మహా మంగళహారతులు



పులివెందుల కదిలించే వార్త 24 పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారము పురస్కరించుకుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం, కుంకుమార్చన ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం అమ్మవారు విశేష పూల అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భగలాముఖి అమ్మవారి జయంతి సందర్భముగా ప్రత్యేకించి ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకాల దీపాలు, కూష్మాండ గుమ్మడి కాయ, కొబ్బరికాయ పసుపురంగు దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ,అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ ఈరోజు అష్టమి భగలాముఖి అమ్మవారి జయంతి కావడంతో అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు కుంకుమార్చన మొక్కుబడి సమర్పించి తమ మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు.ప్రత్యేకించి ఆది,మంగళ,శుక్రవారములు, అష్టమి, పౌర్ణమి, అమావాస్య రోజున అమ్మవారికి 108 ప్రదక్షిణములు చేసి నమస్కరించిన యెడల కోరిన కోరికలు తీరుతాయని భక్తుల అపారమైనటువంటి నమ్మకము.ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి.అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసినటు వంటి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు..ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ,భక్తదులందరూ పాల్గొన్నారు

# మూగజీవాల మనుగడకు ప్రమాదం

## - గ్రామపంచాయతీ యంత్రాంగం నిర్లక్ష్యం -

## - పశువుల కడుపుల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలు

## - చర్యలు చేపట్టాలంటున్న పర్యావరణ, పశు ప్రేమికులు



వేముల కదిలించే వార్తఏప్రిల్ 24: ప్లాస్టిక్ కవర్లు తింటున్న ఈ దృశ్యం చూడడానికి షరా మామూలే అనిపించవచ్చు. కానీ కాస్త లోతుగా మానవీయ కోణంలో ఆలోచన చేస్తే భావితరాల పశు సంపద మనుగడకు ఎంత విఘాతం కలుగుతుందో అర్థమవుతుంది. ఒకవైపు గ్రామపంచాయతీ అధికారులు నిత్యం ప్లాస్టిక్ వాడకం చేపట్టవద్దని తద్వారా పర్యావరణం దెబ్బతినడమే కాకుండా మూగజీవాల మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందని ప్రచారం చేస్తున్నారు. కానీ అదే గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఏదులాపురం గ్రామపంచాయతీ పరిధిలోని అనేక వార్డుల్లో ప్రణాళికయుతంగా చెత్త సేకరణ చేపట్టకపోవడంతో కాలనీవాసులు ఖాళీ ప్రదేశాలలో చెత్తను పారబోయడం శరామాములే అయింది. దీంతో దుర్గంధం దుర్వాసనతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను పరమాన్నంగా భావిస్తున్న మూగజీవాలు నిత్యం వాటిని వేస్తున్నాయి. ఫలితంగా అనారోగ్యాన బారిన పడుతున్నాయి.క్రమం తప్పకుండా గ్రామపంచాయతీ అధికారులు చెత్త సేకరణ చేపడితే ఇలాంటి పరిస్థితి ఏర్పడబోదని స్థానికులు పేర్కొంటున్నారు. ఫొటోలో కనిపిస్తున్న ఈ దృశ్యం గ్రామపంచాయతీ లో చోటుచేసుకుంది. అనేకమార్లు శానిటేషన్ సిబ్బంది ప్రణాళికబద్ధంగా చెత్త సేకరణ చేయకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో కాలనీవాసులు బయట ప్రాంతాల్లో చెత్తను పారబోస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, ఖరీదైన ఇండ్లకు వద్దకు మాత్రం తెల్లవారుజామునే వచ్చి చెత్త సేకరించే శానిటేషన్ సిబ్బంది నిరుపేదలు, మధ్య తరగతి ప్రజల కాలనీలకు మాత్రం అప్పుడప్పుడు వచ్చి వెళ్తున్నారనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు గ్రామపంచాయతీ పర్యావరణ పరిరక్షణ అధికారి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోయకుండా, పశు వులు ప్రమాద బారిన పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. మరి గ్రామ పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# సొంత నిధులతో గ్రంథాలాయానికి రాము పుస్తకాల వితరణ

## - పోటీ పరీక్షలకి సిద్ధమయ్యే విద్యార్థులు పుస్తకాలను సద్వి నియోగం చేసుకోవాలి



వేముల కదిలించే వార్త ఏప్రిల్ 24:నిరుద్యోగ యువత ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అండగా నిలిచేందుకు వినూత్న నిర్ణయం తీసుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ని దృష్టిలో పెట్టుకుని, అభ్యర్థులకు అవసరమైన దాదాపుగా లక్ష రూపాయల విలువైన పుస్తకాలను తన సొంత నిధులతో వేల్పుల గ్రంథాలాయానికి బహు కరించాడు. వీటిలో పోలీస్, డి ఎస్ సి , గ్రూప్ 1, గ్రూప్ 2, ఏపీపీఎస్సీ ఏ ఈ ఈ (సివిల్, ఎలక్ట్రికల్ ), ఏపీ జెన్కో, ఏపీ ట్రాన్స్కో, ఏపీ డిస్కమ్ ఏ ఈ ఈ , కి సంబంధించిన పుస్తకాలు వున్నాయి. అలాగే ఆల్ ఎంట్రన్స్ కి సంబందించిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు .అనగా ఏపి పాలీసెట్,ఏపి ఈసెట్, ఏ పి ఎంసెట్, నీట్, ఐఐటి అడ్వాన్స్ మెయిన్స్ కు సంబంధించి కూడా అందుబాటులో ఉంచారు . పెద్దలకి, పిల్లలకి, ముసలి వాళ్లకి వినోదా న్ని, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు కూడా ఇవ్వడం జరిగింది.

**విద్యార్థులకి పిలుపు :**

ఈ సందర్భంగా వేల్పుల రాము మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఆర్థిక ఇబ్బందుల వళ్ళ ఖరీదైన పుస్తకాలు కొనుగోలు చేయలేక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యం తో, పోటీ పరీక్షలకి సిద్ధమయ్యే విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వి నియోగం చేసుకుని, ఉన్నత ఉద్యోగాలు సాధించి వేల్పులకు, మండలానికి మంచి పేరు తేవాలని కోరారు.

# వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి

## - ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 24:

రబీ సీజన్‌లో వరి సాగు చేసిన రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం బద్వేలు రైతులు ఎంపీని కలిసి,పంట చేతికి వచ్చే సమయం దగ్గర పడుతున్నా కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరుగుతోందని,తద్వారా తాము ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. రైతుల విజ్ఞప్తిపై ఎంపీ తక్షణమే స్పందించారు.ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్ తో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు.రైతులు ఆందోళన చెందకుండా ప్రభుత్వం ద్వారా మద్దతు ధర కల్పించేలా కొనుగోలు కేంద్రాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎంపీ ఆదేశాలపై స్పందించిన కలెక్టర్,త్వరలోనే జిల్లా వ్యాప్తంగా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.తమ సమస్యపై సానుకూలంగా స్పందించిన ఎంపీకి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా భూమికి పునర్జీవం

## - పుడమితల్లికి పి ఎమ్ డి ఎస్ విధానంతోనే ఆరోగ్యం పదిలం

## - జిల్లా ప్రకృతి వ్యవసాయ ఎన్ ఎఫ్ ఏ శ్రీనాథ్ రెడ్డి





లింగాల కదిలించే వార్త ఏప్రిల్ 24

పుడమితల్లికి పి ఎమ్ డి ఎస్ విధానంతోనే ఆరోగ్యం పదిలం,అని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా భూమికి పునర్జీవం లభిస్తుందనిజిల్లా ప్రకృతి వ్యవసాయ ఎన్ ఎఫ్ ఏ శ్రీనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారంలింగాల మండలం చిన్నకూడాలా గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం లో భాగంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ ఎన్ ఎఫ్ ఏ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పంటల రసాయన వ్యవసాయం వలన భూమి సారాన్ని కోల్పోయి నిస్సారంగా మారిపోయింది కాబట్టి అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా భూమికి పునర్జీవం పోయటానికి పి ఎమ్ డి ఎస్ కోసం ఫ్రీ మాన్సూన్ డ్రై సోయింగ్(25 రకాల విత్తనాలు)(15 కిలోలు '1 'ఎకరానికి )(నవధాన్యాలు)పద్ధతులలో ప్రతి ఒక్క రైతు తనకున్న పొలంలో రుతుపవనాల కంటే ముందుగా ఖాళీగా ఉన్న బీడు భూములన్నీ కూడా నవధాన్యాలను విత్తుకొని వాటిని 65 రోజుల పూత దశలో పశువులకు మేతగా ఉపయోగించి మిగిలిన వ్యర్థ పదార్థాన్ని భూమిలోకి కలయిదున్నుకోవాలి భూమి సారవంతం పెరిగి ప్రధాన పంటకు కావాల్సిన అన్ని రకాల సూక్ష్మ స్థూల పోషకాలు అందిస్తాయి జయలక్ష్మి ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం నందు 150 కిట్లు తయారుచేయడం,రైతులకు అందుబాటులో ఉంచడం జరిగింది కావాల్సిన రైతులు తీసుకువెళ్లాలని కోరుచున్నాము, మండల ఎంటి భాస్కరరెడ్డి ,మాట్లాడుతూ ఇలాంటి పద్ధతులు వాడడం వల్ల భూమికి కావాల్సిన పోషకాలను అందిస్తూ మరియు పెట్టుబడిని తగ్గించుకుని మంచి దిగుబడి పొందవచ్చని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పిఆర్పి . జయనాయక్, డి ఎం ఎం టి. యామిని లత,మండల ఏపీ సీ ఎన్ ఎఫ్ సిబ్బంది మరియు రైతులు పాల్గొనడం జరిగింది

# సమాజ సమానత్వం కోసం పాటుపడిన వ్యక్తి అంబేద్కర్

## - డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో ఎంపీ





బద్వేల్ కదిలించే వార్త ఏప్రిల్ 24

సమాజ స్థాపన, సామాజిక న్యాయం, మరియు సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాతగా, సంఘ సంస్కర్తగా, విద్యావేత్తగా, మరియు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చరిత్రలో నిలిచిపోయారని జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆహ్వానం మేరకుశుక్రవారంబద్వేలు పట్టణంలో ఏర్పాటుచేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా బద్వేల్ నియోజకవర్గం ప్రజలు అభిమానులు దృశ్యాల్వా గజమాలతో ఎంపీ అవినాష్ రెడ్డికి సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంపీ అవినాష్ రెడ్డి,ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం వల్ల ప్రతి ఒక్కరు ఎంతో స్వేచ్ఛగా తిరుగుతున్నారు అంటే ఆ గొప్పతనం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వలనే అనివారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ ప్రజలు అభిమానులు వైసీపీ శ్రేణులు అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం మానుకోవాలి.

## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.



వేంపల్లె కదిలించే వార్త ఏప్రిల్ 24 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం,కార్పొరేట్ పరం చేయడం మానుకోవాలని కూటమి ప్రభుత్వానికి రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం వల్ల ప్రతిభావంతులైన పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని, సంబంధిత ఆసుపత్రుల్లో రోగులు ఉచిత వైద్యానికి నోచుకోరని అన్నారు.ఈ చర్య ప్రతిభకు పాడె కట్టడం పసిడి కి పట్టాభిషేకం చేయడమే అవుతుందన్నారు.తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడైన స్వర్గీయ రామారావు వైద్య విద్యను ప్రైవేటుపరం చేయడాన్ని పూర్తిగా వ్యతిరేకించే వారని తులసి రెడ్డి గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు మంజూరయ్యాయి. అందులో ఆరు కళాశాలలు విజయనగరం,రాజమండ్రి, ఏలూరు,నంద్యాల, మచిలీపట్నం, పాడేరు గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమై ప్రభుత్వ రంగంలో నిర్వహించబడుతున్నాయి. పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రభుత్వ రంగంలోనే ఈ విద్యా సంవత్సరం 2026-27లో ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిగిలిన 10 వైద్య కళాశాలలు పులివెందుల, ఆదోని, పెనుగొండ, మదనపల్లి, మార్కాపురం, బాపట్ల, పాలకొల్లు,అమలాపురం, నర్సీపట్నం,పార్వతీపురం వీటిని ప్రైవేట్ పరం చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించడం దురదృష్టకరమని తులసి రెడ్డి అన్నారు. ఈ కళాశాలలను నిర్మించేందుకు,నిర్వహించేందుకు ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని చంద్రబాబు ప్రభుత్వం చెప్పడం కేవలం సాకు మాత్రమే.ఈ పది కళాశాలల్లో అన్నిటికీ భూమిని సేకరించడం జరిగింది.భవనాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. కేవలం 5000 కోట్ల రూపాయలు ఖర్చు పెడితే ఈ పది ప్రభుత్వ వైద్య కళాశాలలు పూర్తి అవుతాయి నాబార్డు ఈ పది కళాశాలలకు ఆర్థిక సహాయం చేసేందుకు ఒప్పందం కూడా కుదుర్చుకున్నది. రాష్ట్ర బడ్జెట్ 2026-27 కు సంబంధించి మూడు లక్షల 33 వేల కోట్ల రూపాయలు.అందులో 5000 కోట్ల రూపాయలు చాలా స్వల్పం.కాబట్టి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేనందువల్ల ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు అప్పగించాలని నిర్ణయించామని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమని తులసి రెడ్డి అన్నారు. పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు సంబంధించి దాదాపు నూరు కోట్ల రూపాయలు విలువ చేసే 50 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించడం జరిగింది . భవనాల మీద,మౌలిక సదుపాయాల మీద 412 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగింది.625 పడకల ఆసుపత్రి భవనాలు పూర్తయ్యాయి.నర్సింగ్ కాలేజీ భవనాలు నూరు శాతం పూర్తయ్యాయి.కళాశాలకు సంబంధించిన భవనాలు 70 శాతం పూర్తి అయ్యాయి.మిగతా మౌలిక సదుపాయాలు 70 శాతం పూర్తయ్యాయి. ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్స్,60 మంది డాక్టర్లు,70 మంది నర్సులు,130 మంది ఇతర సిబ్బంది గత ప్రభుత్వ హయాంలోనే నియమించడం జరిగింది.నేషనల్ మెడికల్ కమిషన్ వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి వసతి సౌకర్యము, ఫ్యాకల్టీ ఉన్నాయని నిర్ధారణకు వచ్చి 2024 -25 విద్యా సంవత్సరానికి 50 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు చేయడం జరిగింది. కానీ దురదృష్టవశాత్తు సౌకర్యం లేదు, ఫ్యాకల్టీ లేదు కాబట్టి ఈ 50 సీట్లు మాకు వద్దు అని చంద్రబాబు ప్రభుత్వం నేషనల్ మెడికల్ కమిషన్కు లేఖ రాయడం జరిగింది . ఈ కారణంగా 2024 -25 లో 50 ఎంబిబిఎస్ సీట్లు,2025- 26 లో 150 ఎంబిబిఎస్ సీట్లు, 24 పీజీ సీట్లు, 2026-27 లో 150 ఎంబీబీఎస్ సీట్లు,24 పీజీ సీట్లు ఒక పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలలోనే కోల్పోవడం జరిగింది. ఇప్పటికైనా పై 10 ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటుపరం చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుని,ప్రభుత్వ రంగంలోనే వీటిని ఈ విద్యా సంవత్సరంలోనే ప్రారంభించాలని,లేకపోతే ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతకు గురికావాల్సి వస్తుందని తులసి రెడ్డి హెచ్చరించారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం.

## - రూ.15 లక్షల రూపాయలు పంట నష్టం.

## - బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేసిన జడ్పిటిసి రవి కుమార్ రెడ్డి.





వేంపల్లె కదిలించే వార్త ఏప్రిల్ 24 విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అరటి తోట దగ్ధమై దాదాపు 15 లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆకుమల్లు రాములమ్మ వాపోయింది. మండలంలోని గిడ్డంగివారిపల్లె గ్రామానికి చెందిన ఆకుమల్లు రాములమ్మ కు వేముల మండలం, మీదిపెంట గ్రామంలో ఉన్న 3 ఎకరాల పొలంలో అరటి చెట్లు నాటింది. తొలికాపు పంట చేతికి వచ్చే సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో అరటి గెలలు పూర్తిగా కాలిపోయాయి. అరటి గెలలతో పాటు డ్రిప్ పరికరాలు, పైపులు కూడా పూర్తిగా కాలిపోయాయి. అరటి పంట చేతికి వచ్చే సమయంలో ఇలా జరగడంతో బాధితురాలు ఆకుమల్లు రాములమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. దాదాపు 15 లక్షల రూపాయలు నష్టం వాటి ల్లిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయం పై వేంపల్లె జడ్పిటిసి మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి స్పందించారు. ప్రభుత్వం వెంటనే బాధితురాలు ఆకుమల్లు రాములమ్మ ను ఆదుకొని నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# మలేరియా రహిత సమాజమే మన లక్ష్యం

**- పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత**

**- ఆర్డీవో .చిన్నయ్య**

పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 24

పులివెందుల, ప్రపంచ మలేరియా దినోత్సవం (ఏప్రిల్ 25) పురస్కరించుకుని, "ఇప్పుడు మనం సాధించగలం – ఇప్పుడు మనం తప్పక సాధించాలి" అనే నినాదంతో పులివెందుల రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్డీవో.చిన్నయ్య ని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మౌనిద్దీన్ , బాకరాపురం వైద్యాధికారి డాక్టర్: శాంత కుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య కలసి దోమల నియంత్రణలో అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయం మరియు సహకారం ఉండేలా చూడాలని ఈ సందర్భంగా వారు ఆర్డీవో ని కోరారు. ఈ సందర్భంగా ఆర్డిఓ చెన్నయ్య మాట్లాడుతూచిన్నయ్య మలేరియా నిర్మూలన అనేది కేవలం ఆరోగ్య శాఖ బాధ్యత మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలని, రాత్రి వేళల్లో తప్పనిసరిగా దోమతెరలు వాడాలని ఆయన తెలిపారు. అనంతరం డాక్టర్ ఖాజా మౌనిద్దన్ (డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ):లి పులివెందుల డివిజన్ వ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాలేదని, వ్యాధి పూర్తిగా అదుపులో ఉందని తెలిపారు. మలేరియాను శాశ్వతంగా తరిమికొట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, ఏప్రిల్ 25 శనివారం నాడు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని



చెప్పారు.డాక్టర్: శాంత కుమార్ వైద్యాధికారి చలిజ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా లభిస్తాయని తెలిపారు.సిద్దయ్య సబ్ యూనిట్ అధికారి క్షేత్రస్థాయిలో నిరంతరం లార్వా నిర్మూలన చర్యలు మరియు ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమం ద్వారా నీటి నిల్వలను తొలగించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది నరేష్, గంగశేఖర్, సూర్య, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమం, సమాజ హితం, వరప్రసాద్ అభిమతం

**- మాజీ మున్సిపల్ చైర్మన్ వర ప్రసాద్ ని ఘనంగా సన్మానించిన,**

**- డా. బత్తల హరిప్రసాద్**

పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 24

పేదల సంక్షేమాన్ని, సమాజ హితాన్ని తన అభిమతంగా మార్చుకొని ప్రజా ప్రతినిధిగా డాక్టర్ వరప్రసాద్ అందించిన సేవలు విశిష్టమైనవని స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ బత్తల హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలోపులివెందుల మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాదని వారి స్వగృహం నందు డాక్టర్ హరిప్రసాద్ బృందం మర్యాదపూర్వకంగా కలిసి పూల మాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరప్రసాద్ ప్రజా ప్రతినిధిగా తన నేపథ్యం ప్రారంభమైనప్పటి నుండి నేటి వరకు పేద ప్రజల సంక్షేమానికి మరియు సమాజ హితానికి తన సేవలు అవసరమైన ప్రతి చోట నేనున్నానంటూ ఆయన అందించిన సేవలు పేద ప్రజల సేవ పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలోడా. బత్తల హరిప్రసాద్,స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్,డ




రాయదుర్గం నియోజకవర్గ పరిశీలకులు, మాజీ కౌన్సిలర్ ఖాతిబ్ షబ్బీర్, కాంట్రాక్టర్ బాబా, జకీర్, రఘు,కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిల్ తీర్మానం మేరకు సిసి రోడ్, యూజీడి నిర్మాణ పనులు

**- సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం**

**- మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి**





పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 24

పులివెందుల నారాయణ కాలేజ్ ప్రాంతంలో యుజీడి, సిసి రోడ్ వంటి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి హామీ ఇచ్చారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో నారాయణ కాలేజీ సమీపంలో ఉన్నటువంటి ఆ ప్రాంతవాసులు సీసీ రోడ్డు నిర్మాణం యు జి డి సమస్యలను మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి దృష్టికి గతంలో తీసుకరావడం జరిగింది. ఈ సమస్యలపై కౌన్సిల్ తీర్మానం మేరకు ప్రారంభించడం జరిగిందని, సిసి రోడ్లు, యు జి డి పనులను నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని ప్రజలకు సేవలు అందించేందుకు పదవులే అవసరం లేదని ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ వైకాపా అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్లపల్లి కిషోర్, వైసిపి నాయకులు తోటం శెట్ట హరి, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు కంటే పెద్ద వెన్నుపోటు దారుడు బీటెక్ రవి

**- రైతులకు చిత్తశుద్ధితో మంచి చేసే ఆలోచన బీటెక్ రవి కలగాలి**


**- లింగాల మండల వైసీపీ నాయకులు**

పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 24 టీడీపీ 2014 నుంచి ఇప్పటి వరకు 7 ఏళ్లు అధికారం లో ఉన్నా , రైతుల కోసం ఏమి చేశారో, ఈ పులివెందులకు ఏమి వెలగపెట్టారో చంద్రబాబు కంటే పెద్ద వెన్నుపోటు దారుడు బీటెక్ రవి సమాధానం చెప్పాలని లింగాల మండల కన్వీనర్ బాబు రెడ్డి, రైతు విభాగం అధ్యక్షులు చంద్రశేఖర రెడ్డి, మురారిచింతల మాజీ సర్పంచ్ బాబా హుస్సేన్, గుణకణపల్లి మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, బీటెక్ రవి పై ధ్వజమెత్తారు. శుక్రవారం పులివెందుల జగన్ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూఒకప్పుడు తుంగభద్ర నీటిని మన ప్రాంతానికి తరలించాలంటే తుంపర డీప్ కట్ వద్ద రైతులు నిద్ర మేల్కొని పడిగాపులు కాసి ఒక్క టీఎంసీ నీళ్లు తెచ్చుకోవడం కూడా గగనం అయ్యేది... ఎంపీ అవినాష్ రెడ్డి మన నీటి వాటా కోసం అనంతపురం కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేయడం జిల్లా రైతులకు తెలిసిందే , అలాంటి పరిస్థితి నుంచి ప్రతి రైతు ప్రతి ఎకరాకు నిశ్చింతగా వ్యవసాయం చేయగలగడానికి నేడు సీబీఆర్ లో 10 టీఎంసి ల పూర్తి స్థాయి సామర్థ్యం లో నీరు నింపుతున్నారు అంటే దానికి కారణం, వైయస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్ అవినాష్ రెడ్డి కాదా,అలాగే గండికోట ప్రాజెక్టు 25టిఎంసి లకు పెంచి తద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కు ఎత్తి పోతల ద్వారా నీరు తెచ్చిన ఘనత మరియు పులివెందుల ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకొచ్చిన ఘనత వైయస్ కుటుంబానిదే కదా,పులివెందుల ప్రజలు చంద్రబాబే పెద్ద వెన్నుపోటు దారుడు అనుకునేవారు..మైనింగ్ దోపిడీ పేకాట , కోడిపందేలు ,ఇసుక దోపిడీ,లిక్కర్ మాఫియా రూపం లో కోట్లు దోచుకొని దాచుకొనే నీవు నీ కుటుంబ సభ్యులు ఎక్కడ వాటా అడుగుతారో అని 15 లక్షలు పెట్టడానికి తల ప్రాణం తోకకి వచ్చింది అంటూ కాకమ్మ కబుర్లు చెప్పుతూ డబ్బులు లేవంటూ నీ సొంత అన్నదమ్ములకు చంద్రబాబు కంటే పెద్ద వెన్నుపోటు పొడుస్తున్నావు అని పులివెందుల ప్రజలే పూల అంగళ్ల వద్ద అనుకోవడం నీ దృష్టి కి రాలేదా,మొన్నటికి మొన్న బియాండ్ తాతి రెడ్డి పల్లి పంప్ హౌస్ వద్ద ట్రాన్స్ఫార్మర్ మరమ్మత్తులకు గురి అయితే పట్టించుకున్న పాపాన పోలేదు, ఎంపీ ట్రాన్స్ఫార్మర్ తెస్తే దానికి కనెక్షన్ ఇచ్చి రైతులకు నీళ్లు ఇవ్వడాన్ని కూడా రాజకీయం చేసి చివరకు రైతులు ధర్నా చేస్తాం అంటే తప్ప దానికి కనెక్షన్ ఇచ్చిన పాపాన పోలేదు, ఇంతకంటే నువ్వు అడిగే సాక్ష్యం ఏముంది,ఇది మీ నీచ రాజకీయాలకు నిదర్శనం.రైతులు బాగుంటే అంతా మా చలువే అంటూ సంకలు గుద్దుకునే బీటెక్ రవి రైతులు ఇబ్బందిపడితే మాత్రం వారిని పట్టించుకునే దాఖలాలు ఉండవు,దాదాపు 2 మాసాలుగా మోటార్లు పనిచేయక ఇబ్బంది పడుతున్న రైతుల ఆవేదన, గోడు పట్టని బీటెక్ రవి మా ఎంపీ , మా నాయకులు వచ్చి అధికారులకు అల్టిమేటం ఇస్తే తప్ప ఆయనకు చలనం లేదు...పైగా ఎక్కడనుంచి ఏ పరిస్థితుల్లో సెల్ఫీ వీడియో తీసి ఏమి మాట్లాడావో కూడా తెలియని పరిస్థితి లో నువ్వు బోగస్ రవినా, లేక బుర్ర లేని రవి నా అర్థం అవ్వడం లేదు,సాగునీటి ఎత్తిపోతల పథకానికి సంబంధించి మొత్తం 69 మోటార్లు ఉంటే అందులో సగానికి సగం పనిచేసిన ప్రతి ఎకరాకు సాగునీరు అందించే పరిస్థితి నెలకొంటే అవి



బాగుచేయించలేక ఎక్కడో ఉప్పలూరు , కలసపాడు గ్రామ అవసరాల కోసం అధికారుల అనుమతి తో ఇచ్చిన మోటార్ ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది,గత ఏడాది ఏప్రిల్ మాసం లో ఈదురు గాలులకు లింగాల అరటి రైతు కుదేలు అయితే ఈ ప్రభుత్వానికి గానీ బీటెక్ రవి కి గానీ కనీసం చీమ కుట్టినట్లు అయిన చలనం లేదు కనీసం ఏడాది దాటిన కూడా ఒక్క రైతుకు కూడా నయా పైసా పరిహారంగా ఇవ్వలేదు , కోతలు తప్ప చేతలు లేని దద్దమ్మ ప్రభుత్వం ఈ కూటమి ప్రభుత్వం....గతం లో టీడీపీ అధికారం లో ఉన్నప్పుడు ఎన్ని నిరసనలు చేసినా శనగ రైతులకు భీమా చెల్లించకపోతే 2019 లో జగన్ అధికారంలోకి రాగానే జిల్లా రైతులకు పంట భీమా అందించడం మర్చిపోయావ,అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఏ తప్పు చేయకపోయినా మా పార్టీ వారిపై అక్రమకేసులు పెట్టి జైళ్లకు పంపే నీకు అధికారాన్ని వినియోగించి పాడైపోయిన మోటార్ లను మరమ్మత్తులు చేయించలేని దుస్థితి లో మీ పాలన కొనసాగుతోంది,వివేకా హత్యకేసులో సుప్రీమ్ కోర్టు లో అవినాష్ రెడ్డి కి క్లీన్ చిట్ లభించిన, ఇదే కేసు అడ్డుపెట్టుకుని నువ్వు, షర్మిలమ్మ జిల్లా అంత తిరిగి ఓటమి పాలైన ఇంకా పదే పదే వివేకా హత్యకేసు గురించి మాట్లాడుతూ రాజకీయంగా పబ్బం గడుపుకోవడం ప్రజలు ఛీదరించుకుంటున్నారు.రైతు కుటుంబం నుంచి వచ్చిన కుటుంబం కాబట్టి వైయస్ కుటుంబం రైతుల బాధ, ఆవేదనను గుర్తించి కష్టాల్లో ఉన్న రైతన్నను ఆదుకోవడం కోసం స్వంత నిధులు పెట్టడానికి కూడా వెనుకాడటం లేదు ,ఇకనైనా నీచ రాజకీయాలు మానుకొని రైతులకు చిత్తశుద్ధితో మంచి చేసే ఆలోచన బీటెక్ రవి చేయాలని హితవు పలికారు.ఈకార్యక్రమం లో , వైసీపీ నాయకులు నాగేంద్ర రెడ్డి, భూపాల్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, నాగేశ్వర రెడ్డి మరియు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కమల్ అమృత్ వాణి-114 శ్లోకం



ప్రేమవాక్యప్రయోగేన శత్రురపి మిత్రతాం ప్రజేత్ ।
కఠోరవచనం నిత్యం స్నేహభంగకరం భవేత్ ॥తాత్పర్యం.ప్రేమతో మాట్లాడితే శత్రువు కూడా మిత్రుడవుతాడు.కఠిన మాటలు సంబంధాలను చెడగొడతాయి. మృదువైన మాటలు హృదయాలను గెలుస్తాయి.మాటలలో మాధుర్యం ఉండాలి .ప్రేమే బంధాలను బలపరుస్తుంది.కోపం దూరాన్ని పెంచుతుంది. సౌమ్యత జీవన సౌందర్యం.మాటలే సంబంధాలకు పునాది.

-- కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'

# వేంపల్లె మండలానికి హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడిగా దివాకర్ రెడ్డి నియామకం.

వేంపల్లె కదిలించే వార్త ఏప్రిల్ 24



హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ వేంపల్లె మండల అధ్యక్షుడిగా వల్లూరు దివాకర్ రెడ్డిని నియమించారు. జాతీయ అధ్యక్షుడు నందం నరసింహ రావు ఆదేశాల మేరకు, కడప జిల్లా అధ్యక్షుడు ముని యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ, పేదలు మరియు బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలపై కఠినంగా పోరాడతానని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు.అక్రమాలు, అవినీతి ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేస్తూ, బాధితులకు న్యాయం చేయడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# డిగ్రీ కళాశాలలో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం.



వేంపల్లె కదిలించే వార్త ఏప్రిల్ 24

గ్రామీణ వ్యవస్థలో భాగంగా పంచాయతీరాజ్ వ్యవస్థ బలపడి నప్పుడే దేశం సమగ్రంగా అభివృద్ధి సాధిస్తుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు డాక్టర్ బాలగొండ గంగాధర్ పేర్కొన్నారు. కళాశాలలో తెలుగు శాఖ అధిపతి డాక్టర్ ఎల్.నాగలక్ష్మి దేవి ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో పంచాయతీరాజ్ దినోత్సవం ను నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్య వక్తగా వచ్చిన గంగాధర మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో గ్రామాలకు స్వయం ప్రతిపత్తిని ఇవ్వడం జరుగుతూ ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. భారత దేశ రాజకీయ ఐక్యతకు దోహదపడిన మొట్టమొదటి మౌర్యపాలకులు గ్రామీణ వ్యవస్థకు మంచి పునాది వేయగా, తదనంతరం వచ్చిన పాలకులు దీనిని కొనసాగించి పరిపూర్ణమైన వ్యవస్థలతో కూడిన గ్రామాలను నిర్మించారని కొనియాడారు. బ్రిటిష్ వారు సైతం స్థానిక సంస్థలకు స్వయం ప్రతిపత్తిని కల్పించాలని ఉద్దేశంతో వ్యవహరించడానికి కూడా ఆయన తన ప్రసంగము లో పేర్కొన్నారు. గ్రంథాలయ శాఖ అధిపతి డాక్టర్ పి.మాధవరావు మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థ బలోపేతమైన నాడే బల మైన కేంద్ర ప్రభుత్వం ఏర్పడుతుంది అని తన అభిప్రాయం వ్యక్తం చేశారు .73 వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టతకు నాటి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఆ యన కొనియాడారు. ఇంకను ఈ కార్యక్రమంలో వాణిజ్య శాఖ అధిపతి డాక్టర్ మల్లేశ్వరమ్మ ,ఉర్దూ శాఖ అధ్యాపకురాలు షేక్.రేష్మ, కంప్యూటర్ శాఖాధిపతి కిరణమయి మరియు విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ నాగలక్ష్మి దేవి వందన సమర్పణ చేస్తూ స్థానిక స్వపరిపాలన పటిష్టతకు అనేక సూచనలు చేసి విద్యార్థులను జాగ్రత్తలు చేశారు.

# టిడిపి మంత్రులు చౌకబారు ప్రకటనలు మానుకోవాలి

**- చిల్లర రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు**

**- వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి**



వేంపల్లె కదిలించే వార్త ఏప్రిల్ 24

వైసిపి పార్టీపై, వైసీపీ జాతీయ అధ్యక్షుడిపై టిడిపికి చెందిన కూటమి మంత్రులు చేస్తున్న చౌకబారు ప్రకటనలను మానుకోవాలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేతలు సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీలను నేర వేర్చకుండా తప్పుడు విధానాలు, అజెండాలతో ప్రజలను తప్పుద్రోవ పట్టిస్తున్నారని తెలిపారు. టీడీపీ మంత్రులు జుగుప్సాకరంగా మాట్లాడడం శోచనీయం అన్నారు. కడపకు చెందిన పెద్ద దస్తగిరి కుమారుడు చాలా క్లియర్ గా పోలీసులకు పిర్యాదు చేశాడని తెలిపారు. పెద్ద దస్తగిరి కుమారుడు ఇచ్చిన పిర్యాదు పట్టించుకోకుండా ఈనాడు నీచ కథనాలు రాస్తున్నదని మండిపడ్డారు. వైసిపికి ,వైఎస్ జగన్ కు లింక్ పెడుతూ తప్పుడు కథనాలు వండుతున్నారని చెప్పారు. వయస్సు పెరిగే కొద్ది చంద్రబాబు నీచంగా మాట్లాడుతున్నారని తెలిపారు.వైఎస్ జగన్ మీద ఈనాడు నిచమైన, నికృష్టమైన రాతలు రాయడం దుర్మార్గం అన్నారు. చంద్రబాబు మాట్లాడే సమయంలో హోదా, స్థాయి గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద నిందలు వేయడానికి చంద్రబాబుకు సిగ్గు అనిపించలేదా అని ప్రశ్నించారు. దమ్ముంటే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద నేరుగా యుద్ధం చేయగలవా అన్నారు. ఆంధ్రజ్యోతి అంటే చంద్రబాబు, ఆంధ్రజ్యోతి అంటే టిడిపి ఎద్దేవా చేశారు. పొలిటికల్ గేమ్ కోసం చంద్రబాబు దిగజారి రాజకీయాలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలెంటీ, ఎన్నికల తర్వాత చేస్తుందేంటి అని అన్నారు. చంద్రబాబు తన హామీల నుండి ప్రజల దృష్టిని మరలించేందుకు చిల్లర రాజకీయాలు చేస్తున్నట్లు చెప్పారు. మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ నేతలు దాడులు చేసుకొంటే పిన్నెల్లి సోదరుల మీద కేసులు పెట్టడం సరైనది కాదన్నారు. వైఎస్ఆర్ మరణంపై చంద్రబాబు మీద కేసు పెట్టచ్చు అన్నారు. చంద్రబాబు సవాల్ విసిరిన నాలుగు రోజులకు వైఎస్ఆర్ చనిపోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో జరిగే హత్యలకు ఎ-1 గా చంద్రబాబు పై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుకు ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్తారని తెలిపారు. రాజధాని ముసుగులో చంద్రబాబు ప్రజాధనం దోచుకుంటున్నట్లు ఆరోపించారు. మావిగన్ ఉపయోగాలు జగన్ విజన్ ప్రజల్లోకి స్పష్టంగా వెళ్ళిందని తెలిపారు. దస్తగిరిని హత్య చేయాల్సిన అవసరం నిత్యానందరెడ్డి కి ఏముందని చెప్పారు. కడప ఇన్ చార్జ్ మంత్రి సవిత తెలివి ఉండే మాట్లాడుతున్నారా అన్నారు. చంద్రబాబు చేస్తున్న తప్పులను దేవుడు లెక్కిస్తున్నాడని చెప్పారు.

# ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించండి రాయితీ పొందండి

### - మరో 6 రోజులే గడువు

### - మున్సిపల్ కమిషనర్ సి.ముని కుమార్



పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 24:

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)కు సంబంధించి ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించే వారికి ప్రభుత్వం కల్పిస్తున్న 5 శాతం రాయితీకి కేవలం 6 రోజులు మాత్రమే గడువు ఉందని పులివెందుల పురపాలక సంఘ కమిషనర్ సి.ముని కుమార్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నెల (ఏప్రిల్) 30వ తేదీలోపు ఆస్తి పన్నును ఒకే మొత్తంగా చెల్లించే వారికి పన్నులో 5 శాతం రాయితీ లభిస్తుందని,పాత బాకీలు (బకాయిలు) ఉన్నవారు ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం సచివాలయాల పరిధిలో మరియు మున్సిపల్ కార్యాలయంలోని 3 క్యాష్ కౌంటర్లు సెలవు రోజుల్లో కూడా అందుబాటులో ఉంటాయని క్యాష్ కౌంటర్లు ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు కౌంటర్లు పని చేస్తాయి అని అన్నారు.పులివెందుల ?పట్టణంలోని ఆస్తి,ఖాళీ స్థలాల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈ నెల ఆఖరులోపు పన్ను చెల్లించి రాయితీ పొందాలని కమిషనర్ కోరారు.

# వేసవిలో ఆరోగ్యం జాగ్రత్త పాలకూరయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొండ సుబ్బయ్య




కడప ఏప్రిల్ 24 కదిలించే వార్త

రానున్న రోజులలో ఎండలు మరింత తీవ్రతంగా ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. నాగరాజు, కొండా పాలకూరయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొండా సుబ్బయ్య అన్నారు. వేసవిలో మన ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే ప్రచార పోస్టర్లను శు క్రవారం నా డిఎంహెచ్వో వారి కార్యాలయం నందు వారు విడుదల చేయడం జరిగింది . ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 11 తర్వాత వృద్ధులు మహిళలు వికలాంగులు బయట రాకుండా జాగ్రత్తలు పాటించాలని అలాగే విద్యార్థిలు యువత మైదానంలో ఆటలు పోటీలు నిర్వహించకూడదని అలా నిర్వహించి వడదెబ్బకు గురి కావద్దని వారు సూచించారు. ప్రతి ఒక్కరు నీటిని మజ్జిగను ఎక్కువగా చేవించగలరని వారు సూచించారు. ఈ కార్యక్ర మం లో రాయల్ కరీం సేవా సమితి అధినేత అబ్దుల్ రాయల్ కరిముల్లా. హెల్త్ కౌన్సిలింగ్ సభ్యులు డాక్టర్ ఆరిఫ్. రమణ వెంకటసుబ్బయ్య. భరత లక్ష్మి.ప్రభావతి.అనిల్ కుమార్. సుబ్రహ్మణ్యం. తదితరులు పాల్గొన్నారు.

# జగన్ వ్యాఖ్యలు రాష్ట్ర అభివృద్ధికి ముప్పు

### - సానా సతీష్ బాబు



కడప/అమరావతి ఏప్రిల్ 24, కదిలించే వార్త

రాష్ట్రంలో పారిశ్రామిక వాతావరణాన్ని దెబ్బతీసే విధంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ముప్పుగా మారుతున్నాయని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఆందోళన వ్యక్తం చేశారు.గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, ఎన్ని అడ్డంకులు వచ్చినా రాష్ట్ర పురోగతిని ఎవరూ ఆపలేరని ఆయన స్పష్టం చేశారు.దళితులపై జరుగుతున్న హింసకు బాధ్యులైన వారిని రక్షించే విధంగా వైఎస్ఆర్సిపి వ్యవహరిస్తుందన్నారు.వైఎస్ఆర్సిపి కుల వివాదాలను రెచ్చగొట్టడం, హత్య రాజకీయాలను ప్రోత్సహించడం, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే చర్యలకు పాల్పడుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇటువంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం చేయడం ద్వారా తమ అభిప్రాయాన్ని ప్రజలు వెల్లడించారన్నారు.ఇటీవల వీళ్ళ కరపత్రిక ప్రచురించిన కథనాల ద్వారా కాపు, కమ్మ వంటి కులాల మధ్య విభేదాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇది ప్రమాదకర ధోరణి అని. హెచ్చరించారు.హత్య రాజకీయాలు వైఎస్ఆర్సిపి నాయకత్వానికి సహజంగా మారాయని విమర్శిస్తూ, ఇటీవల జరిగిన ఘటనలు కూడా అదే విషయాన్ని నిరూపిస్తున్నాయని అన్నారు.రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతున్న సమయంలో పోలవరం ప్రాజెక్ట్, అమరావతి నిర్మాణం, కొత్త పరిశ్రమల ఏర్పాటు వంటి కీలక కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. భవిష్యత్తులో ప్రజలు మరింత కఠినమైన తీర్పు ఇస్తారని, వైసీపీకి వచ్చిన 11 సీట్లను ఒక సీటుకు పరిమితం చేసేలా నిర్ణయం తీసుకుంటారని హెచ్చరించారు.

# సత్య సాయి బాబా ట్రస్టు సేవలో అభినందనీయం



కడప ఏప్రిల్ 24 కదిలించే వార్త

శ్రీ శ్రీ శ్రీ భగవాన్ పుట్టపర్తి సాయిబాబా తాను ఉన్న లేకున్నా తన పేరును సిరస్థాయిగా ఉండేలా తన శ్రీ సత్య సాయి సేవా సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయం మరువలేమని కొండ పాలకొండయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొండ సుబ్బయ్య అన్నారు. శుక్రవారం నా పుట్టపర్తి సత్య సాయిబాబా లోకం విడిచిన రోజు (వర్ధంతి) సందర్భంగా ఎస్బిఐ కాలనీలో ఉన్న వారి మందిరం నందు సాయిబాబా చిత్రపటానికి కొండ సుబ్బయ్య పూలమాల వేసి వేయడం జరిగినది. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజున కడప నగరంలోని శ్రీ సత్య సాయి సేవ స్వస్థ ఆధ్వర్యంలో నగరంలోని పలుచోట్ల పేదవారికి వికలాంగులకు నారాయణ సేవ అన్నదాన కార్యక్రమం అలాగే విద్యార్థులకు ఉచిత వైద్య దంత శిబిరాలు నిర్వహించడం సంతోషిదాయి కమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ వంకదారి సాయికుమార్ కమిటీ సభ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో వడగాలులపై అవగాహన కార్యక్రమం

పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 24

పులివెందుల నగరిగుట్ట లోని ఆది ఆంధ్ర క్రిస్టియన్ కాలనీలో గల ఎంపీపీ స్కూల్ నందు వడగాలులు-తీసుకోవలసిన జాగ్రత్తలు " పై శానిటేషన్ సెక్రటరీలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీ గౌస్ మాట్లాడుతూ పిల్లలు నీడలో మాత్రమే ఆడుకోవాలి అని, వదులుగా ఉండే దుస్తులను ధరించాలని, అత్యవసరమైతే తప్ప ఎండలో బయటికి వెళ్ళకూడదనీ,వెళ్లేటప్పుడు గొడుగు , టోపీ వంటివి తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం పాఠశాల హెడ్మాస్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ పిల్లలు ఈ ఎండాకాలం లో మంచి నీరు ఎక్కువుగా తాగాలి అనీ మజ్జిగ, దోసకాయ, పుచ్చ కాయ వంటి పదార్థాలలో తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం డేవిడ్ శ్యాంబాబు మాట్లాడుతూ ఎండలో తిరగడం వలన ఒంటిలో ఉన్న నీరు బయటకు ఎక్కువ పోయి డి హైడ్రేషన్ తో కండ్లు తిరిగే అవకాశం ఉంటుందని ఎక్కువ తలనొప్పి, కళ్ళు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్ను సంప్రదించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా యులు సురేఖ, లక్ష్మీ నరసమ్మ,కమలాదేవి,రాజమ్మ శానిటేషన్ సెక్రటరీలు నరసింహారెడ్డి, డేవిడ్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



# బీసీ గళం పోస్టర్లు ఆవిష్కరణ

కడవ ఏప్రిల్ 24 కదిలించే వార్త

26న అనంతపురంలో జరిగే వైఎస్ ఆర్ సి పి బిసిగళం జోనల్ మీటింగ్ కు సంబం ధించిన పోస్టర్లను వైసీపీ జిల్లా అధ్య క్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి మాజీ మేయర్ ఫాకా సురేష్ వైసీపీ కార్యాలయంలో ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వైసీపీ బిసి సెల్ విభాగం అధ్యక్షుడు శివరామ్. శివ యాదవ్ లు మాట్లాడుతూ బిసి లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమ లు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వ హిస్తున్న బిసిగళం సభను విజ యవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 139 బీసీ కులాలకు అనేక రకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను విస్మరిం చారన్నారు.. 26న జరిగే బిసి గళం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రాయల్ బాబు,మోతుకూరి సుబ్బరాయుడు, శ్రీరంజన్రెడ్డి, వినోద్, శివ పాల్గొన్నారు.



# బీ ఎడి కళాశాల అక్రమాలపైన మంత్రి లోకేష్ స్పందించి అవినీతి, అక్రమాలు అరికట్టాలని

### - ఏఐబిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు జగన్ రాథోడ్

కడప ఏప్రిల్ 24 కదిలించే వార్తజిల్లా వ్యాప్తంగా వున్న బిఎడ్ కళాశాలల్లో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఏఐ బి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు జగన్ రాథోడ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్ కి లేఖ ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం వారి కార్యాలయం లో జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఎడ్ సెట్ ఎగ్జామ్స్ జరగక ముందే, కౌన్సిలింగ్ కూడా జరగక ముందే ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా జిల్లా లోని బిఎడ్ కళాశాలలు అక్రమంంగా అడ్మిషన్స్ ఒడిస్సా, బయటి రాష్ట్ర ల వారికి కేటాయిస్తున్నారన్నారు. ఒక్కో అడ్మిషన్స్ 70 వేల నుండి లక్ష వరకు అమ్ముకొంటున్నారన్నారు. ఏ ఒక్క కళాశాలకు కూడా అధ్యాపాకులు గాని, బిల్డింగ్ గాని, లైబ్రరీ గాని అస్సలుకు చాలా కళాశాలకు కళాశాల పేరుతో బోర్డు కూడా ఉండదని అయినా కూడా ఇష్టారాజ్యాంగా అడ్మిషన్స్ చేస్తున్నారని, ఆయా కళాశాలల విషయంలో వైవియు అధికారులు కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి విచారణ జరిపి చర్యలు తీసుకువాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ బి ఎస్ యు నాయకులు పవన్, శాశత్, దినేష్, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.




# మోడీని ప్రశ్నిస్తే "దేశద్రోహం"... మరి దేశాన్ని "నరకం" అంటే?

### - ఎస్ "ట్రంప్" సర్ !

### - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజం

కడప ఏప్రిల్ 24 కదిలించే వార్త

భారతదేశాన్ని నరకంగా తూలనాడుతూ దేశ ప్రజలను తీవ్ర పదజాలంతో కించపరుస్తూ మాట్లాడిన అమెరికా దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పట్ల ప్రతి ఒక్క భారతీయుడు నిప్పులు చెరుగుతున్నాడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం ఎస్ ట్రంప్ సార్ అంటూ జవాబిస్తున్నాడని విమర్శించారు. కానీ తాము మాత్రమే దేశభక్తులుగా చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్, ఎన్డీఏ మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, వైయస్సార్ పార్టీ అధినేత జగన్మోహన్ నోరు మెదపడం లేదని ఆరోపించారు. కడపలోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యంకాలం నుండి ప్రజాస్వామ్య దేశంగా అవతరించిన భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా కీర్తి గడిచిందన్నారు. ఒక ధారావాహిక కార్యక్రమంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దేశంపై విరుచుకుపడుతూ దేశ ప్రజలను విమర్శిస్తున్నప్పటికీ ప్రధాని మోడీ పాపాల భైరవుడిలా వణికిపోతున్నాడన్నారు. దేశభక్తి, జాతీయ వాదం, హిందూయిజం అంటూ అబద్దాలు వల్లిస్తున్న భారతీయ జనతా పార్టీ దాని మాతృ సంస్థలైన ఆర్ఎస్ఎస్, విహెచ్పి, బజరంగ్దళ్ ఏమయ్యాయని నిలదీశారు. దేశ ప్రజలు అన్ని గమనిస్తున్నారని డోనాల్డ్ ట్రంప్ ఫ్రెండ్ మోడీని తప్పక శిక్షిస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భయానా రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధి ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.



# మంగళగిరిలో రెండు రోజుల ఫ్యాన్ పార్క్ -- జూన్ 5 నుంచి ఆంధ్రా ప్రీమియర్ లీగ్-

### - రాజ్యసభ సభ్యులు ఎంపీ సానా సతీష్ బాబు

కడప/మంగళగిరి ఏప్రిల్ 24 కదిలించే వార్త

క్రికెట్ అభిమానులకు ప్రత్యేకంగా మంగళగిరిలో రెండు రోజుల పాటు ఫ్యాన్ పార్క్ను నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యులు ఎంపీ సానా సతీష్ బాబు తెలిపారు. బీసీసీఐ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిఏపిఐఐసి భవనం దగ్గర్లో ఉన్న ఫ్యాన్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఫ్యాన్ పార్క్లో మొత్తం నాలుగు మ్యాచ్లను అభిమానులు ఉచితంగా వీక్షించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.రేపు ఢిల్లీ -- పంజాబ్, రాజస్థాన్ -- హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్లు ప్రదర్శించబడతాయి. ఎల్లుండి గుజరాత్ -- చెన్నై, లఖ్నవూ -- కోల్కతా జట్ల మధ్య మ్యాచ్లు ప్రసారం చేయబడతాయని చెప్పారు.స్టేడియంలో ప్రత్యక్షంగా మ్యాచ్ వీక్షిస్తున్న అనుభూతిని ప్రేక్షకులకు అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఫ్యాన్ పార్క్ కార్యక్రమాలు స్టార్ స్పోర్ట్స్లో కూడా ప్రత్యక్ష ప్రసారం అవుతాయని తెలిపారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఈ కార్యక్రమం నిర్వహణ సాధ్యమైందని ఎంపీ పేర్కొన్నారు.అలాగే, మంగళగిరి ప్రీమియర్ లీగ్లో 120 జట్లు పాల్గొనడం విశేషమని చెప్పారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వ హిస్తున్నామని తెలిపారు. ఇంకా, మంగళగిరి స్టేడియంలో జూన్ 5 నుంచి ఆంధ్రా ప్రీమియర్ లీగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.మంగళగిరిని అన్ని రకాల క్రీడలకు వినూత్న కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ సానా సతీష్ బాబు స్పష్టం చేశారు.





# ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించండి.

### - ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.

తిరుపతి కార్పొరేషన్ కదిలించే వార్త 24 ఏప్రిల్

తిరుపతిలో నగరసాలక సంస్థ పరిధిలో ప్రతి రోజు నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించి, ప్రజలకు సురక్షితమైన నీరు అందించాలని ఇంచార్జి కమిషన్ శారదా దేవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని తాతయ్యగుంట, మల్లయ్యకుంట కట్ట, గోదాదేవి మార్గం, అంకురా రోడ్డు తదితర ప్రాంతాలను ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, హెల్త్ అధికారులతో కలసి ఇంచార్జి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని, ప్రజలకు సరిపడేన్ని నీరు సరఫరా చేయాలని తెలిపారు. రుతుపవనాల వల్ల వర్షాలు రానున్నాయని కాలువల్లో ఎక్కడా మురుగునీరు నిలవకుండా సిల్ట్ తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇంచార్జి కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ తులసికుమార్, డి.ఈ.లు రాజు, లలిత, ఏసీపీ లు మూర్తి, పార్వతి ప్రియ, రెవిన్యూ అధికారులు, సచివాలయ, పారిశుద్ధ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.



# వైసీపీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులుగా వల్లెపు వరప్రసాద్ నియామకం

**- బీసీల సంక్షేమం- పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తా**

**- వైయస్ జగన్ అవినాష్ రెడ్డి లకు రుణపడి ఉంటా**

**పులివెందుల కదిలించే వార్త ఏప్రిల్ 24:**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక పదవుల భర్తీలో భాగంగా పులివెందులకు చెందిన ప్రముఖ నాయకుడు వల్లెపు వరప్రసాద్ కు కీలక బాధ్యతలు దక్కాయి.వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వరప్రసాద్‌ను పార్టీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.?వైఎస్సార్ జిల్లా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వరప్రసాద్ పార్టీ స్థాపన నుండి జగన్ మోహన్ రెడ్డి వెన్నంటి ఉంటూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.ఆయన సేవలను గుర్తించిన అధిష్ఠానం రాష్ట్రస్థాయిలో ఈ పదవిని అప్పగించింది. వల్లెపు వరప్రసాద్‌కు రాష్ట్ర స్థాయి పదవి దక్కడం పట్ల పులివెందుల నియోజకవర్గ వైసీపీ నాయకులు,కార్యకర్తలు మరియు బీసీ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తమపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జగన్ మోహన్ రెడ్డికి, జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డికి వైయస్ మనోహర్ రెడ్డికి సహకరించిన జిల్లా నేతలకు వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.బీసీల సంక్షేమం మరియు పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులుగా ఎంపికైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుకు శుభాకాంక్షలు తెలియజేసిన చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, కూటమి నాయకులు, మహిళలు ఘనంగా సత్కరించిన

**- ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడికి ధన్యవాదాలు తెలిపిన చిత్తూరు ఎమ్మెల్యే, తెలుగు తమ్ముళ్లు**

**చిత్తూరు కదిలించే వార్త 24 ఏప్రిల్**చిత్తూరులో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగా ఎంపికైన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావును శుక్రవారం చిత్తూరు ఎంపీ కార్యాలయంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో.. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చూడ ఛైర్పర్సన్ కఠారి హేమలత, టిడిపి మాజీ అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్ర కుమార్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, తెలుగు తమ్ముళ్లు పుష్పగుచ్ఛాలు అందించి, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అలాగే చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుకు వారు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పార్టీకి అందించిన సేవలను గుర్తించి ఆయనకు పొలిట్ బ్యూరోలో అరుదైన అవకాశం ఇచ్చి గౌరవించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ నారా లోకేష్ బాబుకు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్తో పాటు దొరబాబు కూటమి నాయకులు,కార్యకర్తలు, మహిళా నేతలు ధన్యవాదాలు తెలియజేశారు.



# మే నెల 03 న జరగనున్న (NEET(UG)), 2026, వ్రాత పూర్వక నిర్వహణ పరీక్షల నిర్వహణ కు పగడ్బందీగా ఏర్పాట్లు

**తిరుపతి కలెక్టరేట్ కదిలించే వార్త 24 ఏప్రిల్** తిరుపతి, కలెక్టర్ కార్యాలయంలో మే నెల 03 న జరగనున్న NEET(UG),2026 వ్రాత పూర్వక నిర్వహణ పరీక్షల నిర్వహణ కు పగడ్బందీగా ఏర్పాట్లు చేయడమైనదని జిల్లా రెవెన్యూ అధికారి తెలియజేసారు. జిల్లాలో మొత్తము 09 పరీక్ష కేంద్రాలలో 4542 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. NEET(UG),2026 వ్రాత పూర్వక పరీక్షల నిర్వహణకు సంబంధించిన లైసన్ అధికారులు, జిల్లా నోడల్ అధికారి మరియు సిటీ కోఆర్డినేటర్, ౹ావీ శ్రీ కేంద్రీయ విద్యాలయ నం.1, తిరుపతి, సెంటర్ సూపర్వైజర్లు మరియు సంబందిత ఆదికారులతో శుక్రవారం మద్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సమీక్ష సమావేసము నిర్వహించారు. పరీక్షలు మ 02.00 నుండి మ 05.00 వరకు నిర్వహించబడునని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్ లు, వైర్లెస్ హెడ్ సెట్స్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదని, పరీక్షా కేంద్రాల వద్ద పోలిస్ బందోబస్తు ఏర్పాటు, ఆర్టీసి బస్సు సౌకర్యం, విద్యుత్ అంతరాయం లేకుండా సంబందిత శాఖల అధికారులు చూడాలని, త్రాగు నీరు, టాయిలెట్స్ సక్రమంగా ఉండాలని, అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టిసి వారు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు మరియు లైసన్ అధికారులు, జిల్లా నోడల్ అధికారి మరియు సిటీ కోఆర్డినేటర్, ౹ావీ శ్రీ కేంద్రీయ విద్యాలయ నం.1, తిరుపతి, సెంటర్ సూపర్వైజర్లు మరియు సంబందిత అధికారులు పాల్గొన్నారు . పరీక్ష కేంద్రముల వివరాలు: PM శ్రీ కేంద్రీయ విద్యాలయ నం.1, తిరుపతి. ఎస్.వి.యు క్యాంపస్ స్కూల్, బాలాజీ కాలనీ, తిరుపతి.ఎస్.జి.ఎస్ ఆర్ట్స్ కళాశాల, లక్ష్మీపురం సర్కిల్, తిరుపతిఎస్.జి.ఎస్ హై స్కూల్, భవానీ నగర్, తిరుపతి. శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాల, బాలాజీ కాలనీ, తిరుపతి.శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, పద్మావతి నగర్, తిరుపతి.ఎస్.వి జూనియర్ కళాశాల, సంస్కృత విద్యాపీఠం సమీపంలో, తిరుపతి. ఎస్.వి. ఆర్ట్స్ కళాశాల వింగ్ ఎ, బాలాజీ కాలనీ, తిరుపతి. ఎస్.వి. ఆర్ట్స్ కళాశాల – – వింగ్ బి, బాలాజీ కాలనీ, తిరుపతి.



# హిందువుల సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్న యువ నాయకులు





**అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :**
అనంతపురం నగరంలోని శ్రీ కంఠం సర్కిల్ దగ్గర్లో ఉన్న లెన్స్ కార్ట్ షోరూం నందుకు హిందూ సోదరులు కలిసికట్టుగా వెళ్లి లెన్స్ కార్ట్ బాయ్ కాట్ నినాదంతో హిందువుల యొక్క సాంప్రదాయాలకు గుర్తు చేశారుఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులుగా అరవింద్ నగర్ ఇంచార్జ్ నాగేంద్ర యాదవ్ ముఖ్య నాయకులు నాని లిఖిత్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లారు,ఈ సందర్భంగా నాగేంద్ర యాదవ్ మాట్లాడుతూప్రపంచంలో సనాతన ధర్మం మాత్రమే సర్వ మానవాళి సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రతి ప్రాణి సుభిక్షంగా ఉండాలని కోరుకుంటుంది భారతదేశ ఇతిహాసాల్లో చెప్తున్నటువంటి ఈ ధర్మాన్ని కొన్ని వేల సంవత్సరాల నుండి అనాదిగా వస్తోంది సనాతన ధర్మం అంటే సైన్స్ ధర్మంలోని ఎటువంటి ప్రతి పని కూడా ఇది చర్యగూడ జీవకోటి ఆధారమైనటువంటి ఏదో ఒక దానికి ముడిపడి ఉంటుంది కట్టుబొట్టు వేషధారణ మన గృహ అలంకరణలలోనూ ప్రతి విషయంలోనూ సనాతన ధర్మం హిందూ ధర్మం నిత్య నూతనంగా ఉంటుంది ఇలాంటి ధర్మము ఉన్నటువంటి భారతదేశంలో లెన్స్ కాట్ వ్యవస్థాపకుడు పియూష్ బన్సల్ అయింది ఒక ముస్లిం అమ్మాయిని వివాహం చేసుకున్న తర్వాత హిందూ ధర్మాలను పాటించొద్దండి అంటూ తన లెన్స్ కార్ట్ కార్పొరేట్ సిబ్బంది అందరికీ కూడా ఆదేశాలు జారీ చేశాడు సింధూరం తరించరాదు హిందూ సనాతన ధర్మాలు పాటించరాదు కేవలం బుర్కా ధరించిన వారికి మాత్రమే అనుమతింపబడుతుంది అని తన యొక్క నిర్ణయాలని వ్యతిరేకించాల్సిన పరిస్థితి ఏర్పడింది టెలియచేసరు,ఈ సందర్భంగా నాని లిఖిత్ ప్రాసంగిస్తు హిందూ లెన్స్ కాట్ బాయ్ కాట్ నినాదాన్ని అనంతపురం జిల్లాలో మార్మోగుతుందని ఒక హిందూ లీడర్ గా ఇందుకు సంబంధించి కష్టసుఖాలు ఏమన్నా ఉన్ని తనతో పంచుకోవాలని లెన్స్ కార్ట్ లో ఉన్నటువంటి ఉద్యోగులందరికీ కూడా ఆ నాని పిలుపునిచ్చారు భవిష్యత్తులో లెన్స్ కాటే కాదు ఏ ఇతర ప్రవేట్ కార్పొరేటర్ రంగాలలో హిందూ సాంప్రదాయాలు ధర్మాలు పాటించకూడదని పిలుపునిచ్చారో ఖబర్దార్ అని హెచ్చరించారు మీరు నిజంగా వ్యాపారవేత్తలు అయితే ఇలాంటి నిర్ణయాలు తీసుకోరని తెలిపారు లెన్స్ కార్ట్ లో హిందువులే కాదు క్రిస్టియన్లు ముస్లింలు అందరూ కూడా వచ్చి వ్యాపారం చేసుకుంటారని అలాంటప్పుడు కేవలం బుర్కా ధరించిన వారికి మాత్రమే ఉద్యోగాలు ఇస్తామని తెలపడం అన్యాయమని తెలియజేశారు రేవంత్, ప్రసంగిస్తు భవిష్యత్తులో ఇలాంటి నిర్ణయాలకు తీవ్రమైనటువంటి ప్రతిఘటనలు ఏర్పడతాయని హిందూ లీడర్స్ అందరూ కూడా తెలియజేశారు భారతదేశ భిన్నత్వంలో ఏకత్వం ఏకత్వంలో భిన్నత్వం కలిగినటువంటి దేశమని ఇందులో కేవలం ఒక మతానికి సంబంధించిన వారు ఎంప్లాయిస్ ఉండాలని చట్టం ఎక్కడా కూడా లేదని తగ్గానుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు భారత్ మాతాకీ జై వందేమాతరం జైశ్రీరామ్ వంటి నినాదాలతో వ్యాపార సంస్థ నందు మారుమోగాయి ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు హనుమంత్, ఓబుల్ రెడ్డి తిరుమల నాయుడు, వరుణ్ ప్రవీణ్ ,మధు, రాజ్ కుమార్ పవన్ తదితరులు పాల్గొన్నారు. జైశ్రీరామ్ వందేమాతరం భారత్ మాతాకీ జై అని నినాదాలతో చేస్తూ హిందూ సాంప్రదాయబద్ధమైనటువంటి సింధూరాన్ని అక్కడున్నటువంటి షోరూం ఉద్యోగులకు మరియు వచ్చినటువంటి కస్టమర్లకు వీరు తిలకాన్ని దిత్యారు స్వచ్ఛందంగా కొంతమంది కుంకుమ స్వీకరించారు భారత్ మాతాకీ జై అనే నినాదాలు మార్మోగాయి.

# శ్రీ సత్యసాయి జిల్లాలో 'ప్రపంచ మలేరియా దినోత్సవం' గోడ పత్రికల ఆవిష్కరణ

**పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :**
శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రేపు (ఏప్రిల్ 25) జరగనున్న 'ప్రపంచ మలేరియా దినోత్సవం' పురస్కరించుకుని, జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ మరియు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మలేరియా అవగాహన పోస్టర్లు మరియు పాంప్లెట్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గారు మరియు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.యాంటీ లార్వా ఆపరేషన్స్ (ALO) క్షేత్రస్థాయి సిబ్బంది దోమల పెరుగుదల కేంద్రాలను గుర్తించి, వాటిని వెంటనే తొలగించాలి.ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించి, వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్ ద్వారా పర్యవేక్షించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు మరియు బహిరంగ ప్రదేశాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలి. ప్రతి 15 రోజులకు ఒకసారి హాస్టళ్లు, విద్యాసంస్థలను సందర్శించి ఆహార, నీటి నాణ్యతతో పాటు దోమల వ్యాప్తిని పరిశీలించాలి.అవసరమైన ప్రాంతాల్లో ఇండోర్ రెసిడ్యుయల్ స్ప్రే (IRS), ఫాగింగ్ మరియు ఫోకల్ స్ప్రే నిర్వహించాలి. పాజిటివ్ కేసులు నమోదైన చోట మాస్ సర్వే నిర్వహించి, తగిన చికిత్స అందించాలి. ఈ కార్యక్రమంలో ఐవీస్తూ, ఐమీూ డా. చెన్నారెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. సునీల్, ఖూూ, AMO లక్ష్మణ్ నాయక్, వీూఎజుూ వెంకటేశ్వర్లు మరియు ఇతర ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.




## నగరంలో ఆరోగ్యాధికారి విస్తృత తనిఖీలు. డాక్టర్ యువ అన్వేష్



తిరుపతి కార్పొరేషన్ కదిలించే వార్త 24 ఏప్రిల్
తిరుపతిలో నగరంలోని వివిధ హోటల్స్, ఫుడ్ సెంటర్లపై నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ యువ అన్వేష్ నేతృత్వంలో శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల పంపిణీలో తగిన నాణ్యత లేదనే పిర్యాదులపై శుక్రవారం పలు హోటల్స్ పై హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఫుడ్ అండ్ సేఫ్టీ కంట్రోల్ బోర్డ్ అధికారి మద్దిలేటి సిబ్బందితో కలసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ నగరంలోని హోటల్స్ లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు విక్రయించినట్లు పిర్యాదులు అందడంతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. తాము నిర్వహించిన తనీకీల్లో నమ్మలేని నిజాలు వెలుగు చూశాయని తెలిపారు. ముగ్గిన మటన్, కుళ్ళిపోయిన చికెన్, పాసిపోయిన గుడ్లు వంటివి కనిపించాయని తెలిపారు. ఇలా వచ్చిన వాటిని పరీక్షలకు పంపామని తెలిపారు. ఫలితాలు వచ్చే వరకు హోటల్స్ మూసివేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఇలాంటి ఆహార పదార్థాలు స్వీకరించడం వలన రోగాల పాలు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ తనికీల్లో ఫుడ్ అండ్ సేఫ్టీ కంట్రోల్ బోర్డ్ మెంబెర్స్, నగరపాలక సంస్థ సిబ్బంది ఉన్నారు.

## టిటిడి మాజీ చైర్మన్ ఆదికేశవుల నాయుడికి ఘన నివాళులు అర్పించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



చిత్తూరు కదిలించే వార్త 24 ఏప్రిల్ చిత్తూరులోటిటిడి మాజీ చైర్మన్ ఆదికేశవుల నాయుడు వర్ధంతి సందర్భంగా చిత్తూరు,మురకండట్టులో ఏర్పాటు చేసిన ఆదికేశవుల నాయుడి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్.చిత్తూరు సర్వతోముఖాభివృద్ధికి ఆదికేశవుల నాయుడు అందించిన సేవల ఎనలేనివని కొనియాడారు.ఆధునిక సమాజానికి ఆదికేశవుల నాయుడు సేవలు స్ఫూర్తిదాయకమన్నారు.ఆదికేశవుల నాయుడుకి నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చూడ ఛైర్పర్సన్ కఠారి హేమలత, టిడిపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, టిడిపి సీనియర్ నేత కాజూరు బాలాజీ, కూటమి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# జాతీయ స్థాయిలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ విభాగం.




వేంపల్లె కదిలించే వార్త ఏప్రిల్ 24 జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పులివెందుల జనసేన నేత డాక్టర్ హరీష్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ అగ్రగామిగా ఉన్నందుకు నేను చాలా గర్వపడుతున్నాను. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పంచా యతీరాజ్ ను నెంబర్ వన్ రేసులో మన ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ను తీర్చిదిద్దడం లో జనసేనాని చాలా కష్టపడ్డారు అని ఆయన మాట్లాడారు. తదనంతరం పవన్ కళ్యాణ్ సేవల గురించి మాట్లాడుతూ స్వయంప్రతిపత్తి, స్వావలంబన దిశగా అడుగులు, ఫలితాన్నిస్తున్న ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ప్రణాళికలు,గుడ్ గవర్నెన్స్, ఉమెన్ ఫ్రెండ్లీలో జాతీయ స్థాయిలో మొదటి స్థానం,రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ లోనూ నంబర్ వన్ స్థానం,సంస్కరణలతో వ్యవస్థల బలోపేతం,పారదర్శక విధానాలతో పల్లెల్లో అభివృద్ధి వెలుగులు, పల్లె ప్రగతే పంచాయతీరాజ్ దినోత్సవానికి అసలైన నిదర్శనం అంటున్న ప్రజలు.పవన్ కళ్యాణ్ 22 నెలల కాలంలో ఆ దిశగా ఎన్నో అడుగులు ముందుకు వేశారు. గ్రామీణ పాలనలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు సుధీర్ రెడ్డి, దేవా, మనోజ్,సాయి,తేజ శ్యామ్, మల్లేష్, శీను తదితరులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మొదటవ రోజు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం

**- ఆళ్లగడ్డ రాము ఆలయ ధర్మకర్త**





అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :
గత తొమ్మిది సంవత్సరాలుగా నిర్విరామంగా దాఖల సాయి సాకారాలచే మరియు శ్రీవారి సేవకులచే అనంతపురం పట్టణంలో వాసవికి ఏంటి సందర్భంగా మూడు రోజులపాటు మంచివి పంపిణీ కార్యక్రమం జరుపబడుతుంది అందులో భాగంగా ఈరోజు దాదాపు 1000 మందికి పైగా ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం దాత = = ఝ్వతీం సహాయ సహకారం మరియు శ్రీవారి సేవకులు అలాగే ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో అద్భుతంగా కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు రంగాచారి పాల్గొనడం జరిగింది. వీటితోపాటు శ్రీవారి సేవకులు ఆలయ కమిటీ వారు వారి సేవలను అందించారు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

# వైసీపీతో నరేంద్ర రెడ్డికి సంభందం లేదు.

**- కూటమి పాలనలో నగరంలో పెరిగిన అకృత్యాలు**

**- పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి వీటిని కట్టడి చేయాలి**

**- విలేకరుల సమావేశంలో మాజీ మేయర్,వైసీపీ నగర అధ్యక్షులు**





**అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :**

నగరంలో హానీ ట్రాప్ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న రుద్రంపేట నరేంద్ర రెడ్డికి వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని మాజీ మేయర్ మహమ్మద్ వసీం,వైసీపీ నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్ రెడ్డి లు స్పష్టం చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మహమ్మద్ వసీం :మాట్లాడుతూ గత 4 సంవత్సరాలుగా నరేంద్రరెడ్డిని పార్టీకి దూరంగా ఉంచడం జరిగిందన్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో కూడా రాబోయే ఎన్నికల్లో వైయస్సార్ సీపీ కు ఓటు వేయొద్దు అంటూ గ్రామసభల్లో కూడా బహిరంగంగా చెప్పారని గుర్తు చేశారు. గత ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ నరేంద్రరెడ్డిని వారి ఇంటికి వెళ్లి కలవడం, ఆయన గెలిచిన తర్వాత ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి నరేంద్ర రెడ్డి అభినందించారన్నారు. అయితే నరేంద్రరెడ్డిగతంలో వైయస్ఆర్ సీపీ లో ఉన్నప్పటి ఫోటోతో నిన్నటి నుండి వైయస్ఆర్ సిపి అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. వైయస్ఆర్ సిపి అధికారం కోల్పోయినప్పుడు కూడా 101 టెంకాయలు కొట్టి నరేంద్రరెడ్డి. తన ఆనందం వ్యక్తం చేశారని వైసీపీ చెందిన వ్యక్తి అయితే అలా ఎందుకు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అనంతపురం లో ఇలాంటి ఘటనలు ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో నగరంలో అకృత్యాలు పెరిగిపోయాయని ఆయన విమర్శించారు. నగరంలో కబ్జాలు, ఆక్రమణలు, అక్రమాలు, బెదిరింపులు ఏ స్థాయిలో జరిగాయో ప్రజలు అందరికి తెలుసునన్నారు. గతంలో హైదరాబాద్, బెంగళూరు వంటి పెద్ద పెద్ద నగరాల్లో ఇలాంటి హాని ట్రాప్ లు జరిగేవని కూటమి నేతల అండ, పోలీస్ ల నిర్లక్ష్యంతో అనంతపురంలో ఇలాంటి ఘటనలు జరగడం సిగ్గుచేటన్నారు. ఈ ట్రాప్ లో ఇంకా ఎంతో మంది భాదితులు ఉన్నారని కానీ చాలామంది బయటకి రావడం లేదన్నారు. హాని ట్రాప్ కు పోలీసులు బాధ్యత వహించి ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే వాళ్ళని విచారించి తగిన శిక్షలు విధించాలని ఆయన కోరారు. అంతేకాకుండా రాబోయే రోజిల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. వైసీపీ నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో హాని ట్రాప్ ను ఛేదించిన ఎస్పీ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. గతంలో జిల్లా లో రైతు ఆత్మహత్యలు చూశామని ఇప్పుడు ఇలాంటి ట్రాప్ ల వలలో పడి బాధితులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి చూస్తున్నామన్నారు. రుద్రంపేట నరేంద్ర రెడ్డిని పార్టీ ఎప్పుడో 4సంవత్సరాల క్రీతమే దూరం పెట్టామన్నారు. ఆంధ్రజ్యోతి పత్రికలో గత ఎన్నికల సమయంలో నరేంద్ర రెడ్డి వైయస్ఆర్ సీపీ పై అసంతృప్తి అంటూ రాశారని మళ్ళీ ఇప్పుడు అదే నరేంద్రను పట్టుకుని వైయస్సార్ సీపీ అంటూ రాస్తున్నారన్నారు. అదే విధంగావ్ ఓ ప్రముఖ ఛానల్ గత ఎన్నికల సమయంలో నరేంద్రను వైసీపీ దూరం పెట్టారని చెప్పారని మళ్ళీ అదే ఛానల్ ఇప్పుడు వైకాపా అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. పత్రికలే పార్టీకి పలన నేత దూరం అని రాస్తారని మళ్ళీ అవే సంస్థలు ఏమైనా సంఘటనలు జరిగినప్పుడు వారిని మళ్ళీ పార్టీకి ఆపాదిస్తూ రాస్తున్నారన్నారు. అసత్య ప్రచారాలు మాని ఇప్పటికైనా ప్రజలకు మంచి జరిగే విషయాలను ప్రచురణ చేయాలని ఆయన సూచించారు. నగరంలో గంజాయి, బెల్ట్ షాపులు మితిమీరి పోయాయని విచ్చల విడిగా పర్మిట్ రూమ్ లు పెట్టి నగరాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం పై విమర్శలు చేస్తే పోలీసులు అత్యుత్సాహంతో సుమాటోగా తీసుకుని అక్రమ కేసులు పెడుతున్నారని,పోలీసులు ప్రభుత్వానికి లోబడి కాకుండా, ప్రజల పక్షాన పని చేయాలని ఆయన సూచించారు. పార్టీలకు అపాదించకుండా ఈ హాని ట్రాప్ లో ఎవ్వరు ఉన్నా ఉపేక్షించకుండా ఇంకా లోతుగా విచారణ చేపట్టి బాధితులకి న్యాయం చేయాలని ఇలాంటి ఘటనలు పునావృత్తం అవ్వకుండా అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# బీసీ గళం సభ ఏర్పాట్లను పరిశీలించిన 'అనంత'...







**అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :**

కూటమి ప్రభుత్వం బీసీ లపై చేపడుతున్న నిర్లక్ష్యం, నిరంకుశ ధోరణిని నిరసిస్తూ వైయస్సార్ సీపీ బీసీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన అనంతపురం జిల్లా కేంద్రంలోని కలితకళా పరిషత్ నందు "బీసీ గళం" సభ నిర్వహించనున్నారు. సందర్భంగా శుక్రవారం వైయస్సార్ సీపీ నాయకులతో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, బీసీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, మాజీ మేయర్ వసీం లతో కలిసి లలితకళా పరిషత్ లో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఆదివారం జరుగనున్న "బీసీ గళం" సభకు జిల్లా నలుమూలల నుండిపెద్దఎత్తున ప్రజలు, నాయకులు, మేధావులు హాజరై బీసీ లకు కూటమి ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ పాలనపై గళం విప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు దేవేంద్ర, నాయకులు చింత సోమశేఖర్ రెడ్డి, బోయ లక్ష్మన్న, రాధాకృష్ణ, చింతకుంట మధు, అమర్నాథ్ రెడ్డి, శ్రీనివాసులు, రామచంద్ర, శ్రీనివాస్ రెడ్డి, కిరణ్, కృష్ణవేణి, రాధాయాదవ్, సురేష్, మధు, బెస్త వెంకటేష్, కిరణ్, ఇమ్రాన్, వెంకటేష్, బాలాజీ, సిద్ధూ, దూదు,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి బోధనలు నేటి సమాజానికి ఆదర్శం

**-డాక్టర్ విజయసాయికుమార్**





**అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 24** :భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి బోధనలు నేటి సమాజానికి ఆదర్శమని వారు చేసిన సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ముఖ్యంగా 158 దేశాల్లో స్వామివారిని స్ఫూర్తిగాతీసుకొని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తారని గురు జ్యోతిష్యాలయం బాబా భక్తులు నంద్యాల రఘునాథ్ గురుజీ అన్నారు ఈ దినం భగవాన్ సత్యసాయిబాబా వారి 16 పుణ్య తిథి సందర్భంగా సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వృద్ధాశ్రమాలలో నారాయణ సేవ పేరున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 800 మందికి అన్న ప్రసాదాని అందించి ఆకలి తీర్చారు. ఈ కార్యక్రమంలో సాయి ట్రస్ట్ బృందం రాఘవేంద్ర నరేష్ విజయభాస్కర్ రాజు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్.ఎల్.బి రెండవ నాలుగోవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలి

**- ఈ అకాడమీ ఇయర్ లోనే సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలి**

**- ఎల్ఎల్బి రీవాల్యుయేషన్ రిజల్ట్స్ విడుదల చేయాలి**

**- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రిజిస్టర్ రమేష్ బాబు కి వినతి పత్రం అందజేత**



**అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :**

ఎస్కే యూనివర్సిటీ:: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలో ఎల్.ఎల్.బి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రెండవ నాలుగవ సెమిస్టర్ పరీక్షలు ఈ అకాడమిక్ ఇయర్ లోనే నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎస్కే యూనివర్సిటీ రిజిస్టర్ రమేష్ బాబు గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ ఎల్ ఎల్ బి చదువుతున్న విద్యార్థులకు ఈ అకాడమిక్ ఇయర్లోనే రెండవ మరియు నాలుగవ సెమిస్టర్ పరీక్షలు మే చివరిలోపు నిర్వహించాలని తెలిపారు. ఆరవ సెమిస్టర్ చదివిన విద్యార్థులకు పరీక్షల నిర్వహించడానికి ఎగ్జామ్స్ కట్టుకోవడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు కానీ రెండవ సెమిస్టర్ నాలుగవ సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు.. ఈ విద్యా సంవత్సరంలోపు పరీక్షలు పెట్టకుండా జూన్లోనో జూలైలోనో రెండోవా సెమిస్టర్ నాలుగవ సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు ఏర్పాటు చేస్తే వారికి ఎల్.ఎల్.బి మూడవ సంవత్సరం పరీక్షలు పెట్టడానికి లేటవుతుంది అదే విధంగా అకాడమిక్ ఇయర్ కూడా మారిపోతుంది కనుక విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే ఎల్ ఎల్ బి రెండవ మరియు నాలుగవ సెమిస్టర్ పరీక్షలు మే చివరిలోపు నిర్వహించాలని డిమాండ్ చేశారు.. ఎల్.ఎల్.బి రీవాల్యుయేషన్ రిజల్ట్స్ విడుదల చేసి తక్షణమే రెండవ నాలుగవ సెమిస్టర్ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు... రిజిస్టర్ గారు సానుకూలంగా స్పందిస్తూ ఒకటి రెండు రోజుల్లో పరీక్షా ఫీజు నోటిఫికేషన్ విడుదల చేసి తొందర్లోనే రీవాల్యుయేషన్ రిజల్ట్స్ కూడా విడుదల చేస్తామని తెలుపడం జరిగిందిలిఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చందు యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు కిరణ్ ఉమా మహేష్ నాయకులు తిరుపతయ్య మల్లికార్జున కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా జరిగిన శుక్రవారం శుభంకరి అమ్మవారి ఒడి బియ్యం కార్యక్రమం

**- సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో 54 శుక్రవారం జరగనున్న ఒడిబియ్యం కార్యక్రమం అరవ వారం బుక్కరాయసముద్రం ముసలమ్మ దేవి దేవాలయంలో ఘనంగా జరిగింది**







అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :

పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా సహస్రనామ పారాయణం నిమ్మకాయ , కూష్మాండ దీపాలతో పూజ ఖడ్గమాల మొదలగు పూజలు నిర్వహించారు. అనంతరం అష్టమి రోజున విశేషం గా ముసలమ్మకు ఒడి బియ్యం పెట్టినారు. ఒడి బియ్యం జరగని ఇద్దరు మహిళలకు ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు 54 వారాలకు ఆర్థిక సహాయాన్ని శ్రీమతి రుక్మిణి సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ మాతృమూర్తి ఆర్థిక సాయం అందిస్తు న్నారు .ఆలయ నిర్వాకులు సుశీలమ్మ అమ్మ వారి కార్యక్రమాన్ని శాస్త్రోతంగా నిర్వహించి నారనీ సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవకర్త రుక్మిణి ,సాయి ట్రస్ట్ బృందంరాఘవేంద్ర,నరేష్ ,భువన ,డా నవజ్యోతి ,పల్లవి , పద్మ ,శ్రీదేవి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


# రీసర్వేపై కీలక వర్క్‌షాప్ సమన్వయంతో పనిచేయాలని అదేశిచినా జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్





పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :స్థానిక సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో జిల్లా కలెక్టర్ లిఏ. శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ లిలిఎం. మౌర్య భరద్వాజ్లి ఆధ్వర్యంలో 'రీసర్వే, విలేజ్ పోర్టింగ్, పట్టాదారు పాస్ బుక్ పంపిణీ' అంశాలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతుకు సర్వే నోటీసులు సకాలంలో అందజేయాలి. గ్రామాల్లో లిటామ్ టామ్లి ద్వారా రీసర్వేపై విస్తృత ప్రచారం కల్పించి రైతులను భాగస్వాములను చేయాలి. రెవెన్యూ మరియు సర్వే అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ జాయింట్ ౹్రావీలు (Joint LPMs) నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దీనివల్ల రైతులకు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలకు ఆటంకం కలగకుండా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి శ్రీకర్,=ఋూ, తహసీల్దార్లు, సర్వే ఇన్‌స్పెక్టర్లు, విలేజ్ సర్వేయర్లు మరియు విలేజ్ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల పునరుద్ధరణకు పకడ్బందీ చర్యలు - ఏ.శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :జిల్లాలో నీటి వనరుల సంరక్షణే ధ్యేయంగా 'జలధార – జలహారతి' పథకం కింద చెరువుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. నల్లమాడ మండలంలోని కొత్తకుంట ఫీడర్ ఛానెల్ పనులను, పుట్టపర్తి మండలం కంబాలపర్తి చెరువు మరువ మరియు కాలువలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని చెరువుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి, సప్లై ఛానల్స్‌లో ఉన్న కంప చెట్లను తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసి, రైతులకు అండగా నిలవడం. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విజయ్ ప్రసాద్, ఇరిగేషన్ డిఈఈ టి. గంగాద్రి, ఏపీడీ రామకృష్ణ, తహసీల్దార్లు , ఎంపీడీఓలు మరియు ఇరిగేషన్ ఏఈఈలు పాల్గొన్నారు.

# నల్లమాడ వర్కర్ల సేవలు అభినందనీయం

**- జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్**



నల్లమాడ, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :

జిల్లా కలెక్టర్ శుక్రవారం నల్లమాడ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. తొలుత ౹ాభౌజ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్, అక్కడి వర్కర్ల పనితీరును అభినందించారు. వారి సేవలకు గుర్తింపుగా వర్కర్లను సన్మానించి, బహుమతులు అందజేశారు.'జలధార జలహారతి'లో భాగంగా నల్లమాడ పంచాయతీలో జరుగుతున్న ఫీడర్ ఛానల్ పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష జరిపి, నిర్దేశించిన సమయంలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, తహశీల్దార్, ఈఓఆర్డి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఎంఏ పీడీ విజయ్ ప్రసాద్ , ఎంపీడీఓ, తహశీల్దార్ మనోజ్ కుమార్ రెడ్డి , ఈఓఆర్డీ, ఇరిగేషన్ మరియు ఉపాధి హామీ సిబ్బంది, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నరేంద్రరెడ్డి మీ పార్టీ నేత కాకపోతే ఎందుకు సస్పెండ్ చేయలేదు

- ఆయన అనంత వెంకట్రామిరెడ్డికి సమీప బంధువన్నది నిజం కాదా..?
- వైసీపీ నాయకుల వ్యాఖ్యలు, సాక్షి పత్రిక కథనాలపై అర్బన్ టీడీపీ నేతల ఫైర్
- మేయర్ పదవి అయిపోవడంతో వసీం మతిభ్రమించి మాట్లాడుతున్నాడు
- ప్రతి అంశాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటికి ఆపాదించడం పరిపాటిగా మారింది
- హనీ ట్రాప్ వ్యవహారంలో ఎవరున్నా.. పోలీసులు వదిలిపెట్టరన్న టీడీపీ నేతలు






**అనంతపురం, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :**

హనీ ట్రాప్ కేసులో కీలకంగా వ్యవహరించిన నరేంద్రరెడ్డి వైసీపీ నేత కాకపోతే.. ఆ పార్టీ ఎందుకు సస్పెండ్ చేయలేదో సమాధానం చెప్పాలని అనంతపురం నగర టిడిపి అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ అర్బన్ టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా జిల్లాలో సంచలనం రేపుతున్న హనీ ట్రాప్ లో పట్టుబడిలో రుద్రంపేట మాజీ ఉప సర్పంచ్ నరేంద్రరెడ్డి ఉన్నారన్న వార్తలు వచ్చాయి. నరేంద్రరెడ్డి వైసీపీలో చాలా కీలకంగా వ్యవహరించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే నరేంద్రరెడ్డి ఎమ్మెల్యే దగ్గుపాటికి దగ్గరగా ఉన్నాడంటూ సాక్షి పత్రిక రాయడం, అలాగే వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యల మీద అర్బన్ టీడీపీ నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ నరేంద్రరెడ్డి ప్రస్తుతం వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డికి దగ్గర బంధవుని.. మామ అని పిలించేంత చనువు ఉన్న మాట వాస్తవం కాదా అని నిలదీశారు. ఆయన్ని నాలుగేళ్ల క్రితమే పక్కన పెట్టి ఉంటే.. మీ పార్టీ ఎందుకు సస్పెండ్ చేయలేదో చెప్పాలన్నారు. గత ఎన్నికల్లో కూడా వైసీపీ తరుపున ప్రచారం చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ రోజు హనీ ట్రాప్ లో పట్టుబడ్డాడని తెలియగానే టీడీపీ వ్యక్తి ఎలా అయ్యారన్నారు. మాజీ మేయర్ వసీం పదవి పోయినప్పటి నుంచి మతి భ్రమించి మాట్లాడుతున్నాడన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి తీరు నచ్చక ఎన్నికల సమయంలో,ఆ తర్వాత ఎమ్మెల్యే దగ్గుపాటి వద్దకు ఎంతో మంది వైసీపీ నేతలు వచ్చారన్నారు. ఆయన చేస్తున్న అభివృద్ధిని కూడా స్వాగతించారన్నారు. రుద్రంపేట పంచాయతీ అభివృద్ధి విషయంలో సహకరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారిని నరేంద్ర రెడ్డి కలిశారన్నారు. ఆ సమయంలో ఫోటో దిగితే అతను టీడీపీ మనిషి అవుతాడా అని ప్రశ్నించారు. నరేంద్ర రెడ్డి జగన్ రెడ్డి మొదలుకొని రోజా, మిథున్ రెడ్డితో పాటు అనేక మంది వద్ద దిగిన ఫోటోలు చూపించమంటారా నిలదీశారు. అధికారపార్టీతో పాటు ఎమ్మెల్యే దగ్గుపాటి పై ఏదో ఒక అంశంలో బురదజల్లాలని మొదటి నుంచి వైసీపీ బ్యాచ్ ప్రయత్నిస్తోందన్నారు. హనీ ట్రాప్ వ్యవహారంలో పోలీసులు ఎంతో సీరియస్ గా పని చేస్తూ నిందితుల్ని అరెస్ట్ చేస్తున్నారన్నారు. ఇందులో ఎవరున్నా వదిలే ప్రసక్తి ఉండదన్నారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులు తీసుకుంటున్న చర్యల్ని స్వాగతించాల్సింది పోయి.. పార్టీల రంగు పులమడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా ఇలాంటి నీచ రాజకీయాలు మానుకోవాలని టీడీపీ నేతలు హితవు పలికారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు వన్నురప్ప, పొట్లూరి కేశవ నాయుడు, కదిరప్ప, మధు కుమార్, సుధాకర్, రాము పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో ఘనంగ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు









**పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :**

కలెక్టరేట్‌లోని PGRS హాల్‌లో 17వ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ మట్లాడుతు గ్రామ పంచాయతీలు తమ సొంత వనరులను పెంచుకోవాలని, ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విశిష్టమైన *SVAMITVA* కార్యక్రమం మరియు జలధార, జలకళ వంటి పథకాల గురించి వివరించారు. ఎమ్మెల్యే మట్లాడుతు: గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. గ్రామ స్థాయి అధికారుల సేవలను ఆమె కొనియాడారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. అలాగే పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి, వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మరియు జిల్లా పంచాయతీ అధికారి సమత పాల్గొన్నారు.

# ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్





**పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :**

'జలధార-జలహారతి' కార్యక్రమంలో భాగంగా నల్లమాడ మండలం కొండిగానిగుట్ట వంకలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫీడర్ ఛానల్ డీసిల్టింగ్ (పూడికతీత) పనులను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు పనుల అంచనా వ్యయం, నీటి మళ్లింపు మార్గాల గురించి అధికారులను ఆరా తీశారు. ఇరిగేషన్ డి.ఇ మరియు ఏ.పి.ఓ లు స్పందిస్తూ.. రూ. 4.99 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. కొండిగానిగుట్ట వంక నుండి వచ్చే నీరు కొత్తకుంట మీదుగా రెడ్డిపల్లి చెరువుకు, అక్కడ నుండి మలుకవేముల చెరువుకు చేరుతాయని వివరించారు. అనంతరం కలెక్టర్ గారు మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి చెరువుకు నీరు అందేలా ఉపాధి హామీ పథకం కింద అన్ని ఫీడర్ ఛానల్స్‌కు అంచనాలు సిద్ధం చేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి కె. విజయ ప్రసాద్, పుట్టపర్తి క్లస్టర్ ఏపీడి వి. రమేష్ బాబు, తహశీల్దార్ మనోజ్ కుమార్ రెడ్డి , ఎంపీడీవో, ఇరిగేషన్ డి.ఇ మరియు ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు, పిల్లల భద్రతకు జిల్లాలో ఢోకాలేదు ... ప్రభుత్వం, పోలీసుశాఖలు అండగా ఉన్నాయి

- జిల్లా వ్యాప్తంగా ఎస్పీ శ్రీ పి.జగదీష్ IPS ఆదేశాలతో మహిళల భద్రతపై అవగాహనలు
- గంజాయి కట్టడి, సైబర్ నేరాల నియంత్రణ, తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన తెస్తున్న పోలీసులు





**అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :**

అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఖూా ఆదేశాల మేరకు పోలీసులు ఈరోజు జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన చేశారు. ముఖ్యంగా స్త్రీరక్ష పోర్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మహిళల భద్రతను బలోపేతం చేయడానికి జిల్లా ఎస్పీ చొరవ తీసుకుని ఈ పోర్టల్ ను ప్రారంభించి క్షేత్రస్థాయి మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలియజేశారు. ఇంట్లో నుంచే నేరుగా జిల్లా ఎస్పీ గారి దృష్టికి తీసికెళ్లి పరిష్కరించుకునే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. శక్తి యాప్, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన చేశారు. ఆపదలో ఉన్న మహిళల భద్రత/రక్షణ కోసం ప్రభుత్వం ఈ యాప్ ను రూపొందించిందని, మహిళలు తమ సెల్ ఫోన్లలో యాప్ డౌన్లోడ్ చేసుకుని ఎలా రక్షణ పొందవచ్చో తెలియజేశారు. అంతేకాకుండా... నేరాల జోలికెళ్లరాదని... అక్రమ మద్యం, మట్కా, పేకాట, గుట్కా, తదితర చట్టవ్యతిరేక కార్యపాల జోలికెళ్లొద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, సైబర్ నేరాలు, గంజాయి - అనర్థాలపై చైతన్యం చేశారు. గంజాయి నిల్వ ఉంచినా, విక్రయించినా, అక్రమ రవాణాకు పాల్పడినా కడకు వినియోగించినా చట్టం గట్టిగా పని చేస్తుందని సూచించారు.

## యల్లనూరు లో బైండోవర్ కేసుల నిబంధనలు ఉల్లంఘించిన ఆరుగురిపై చర్యలు... 14 రోజుల పాటు రిమాండ్ ... సబ్ జైలుకు తరలింపు



అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :

యల్లనూరు మండలం బొప్పేపల్లి గ్రామానికి చెందిన 6 మంది ట్రబుల్ మాంగర్స్ ను గుర్తించి మంచి ప్రవర్తన కోసం 05.05.2025 తేదీన వీ=ూ వారి వద్ద బైండోవర్ చేయించారుఇందులో భాగంగా... యల్లనూరు మండలం, బొప్పేపల్లి గ్రామానికి చెందిన 1.గండి కోట నారాయణస్వామి,2.పత్తికొండ ఆదినారాయణ, 3.పొగాకుల చైతన్య ,4.కప్పల .నారాయణ స్వామి,5.బండి నారాయణస్వామి,6.కప్పల లక్ష్మి నారాయణ లపై కూడా బైండోవర్ చేయించారు. అయితే... బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి 11.07.2025 తేదీన పై వారు అందరూ యల్లనూరు కూచివారి పల్లి గ్రామము వద్ద క్రిమినల్ కేసులో పాల్గొన్నారు.బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడాన్ని తీవ్రంగా పరిగణించిన యల్లనూరు మండల మేజిస్ట్రేట్ రాము సర్ ఈ ఆరుమందికి కి 14 రోజుల పాటు రిమాండ్ విధించారని... దీంతోనే ఈ 6 మందిని తాడిపత్రి సబ్ జైలుకు తరలించామని యల్లనూరు ూ× చీ. రామంజినేయ రెడ్డి తెలిపారు

## రోడ్డు ప్రమాదాల నివారణేలక్ష్యంగా జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ IPS ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై పోలీసుల చర్యలు







అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, ఏప్రిల్ 24 : ముఖ్యంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. రోడ్డు సేఫ్టీ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడంతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన చేసిన ఆయా పోలీసులు పోలీస్ అధికారులు మాట్లాడుతూ, రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు: మైనర్ల డ్రైవింగ్: మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, అలా చేస్తే వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ తప్పనిసరి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరిం చాలని, ఇది ప్రాణాలను కాపాడుతుందని వివరించారు. ఓవర్‌స్పీడ్, ఓవర్‌లోడ్ వద్దు:లివేగంగా, అతిగా లోడ్ చేసి వాహనాలు నడపడం ప్రమాదకరమని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్: మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, డ్రంకెన్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాలు చేయాలని పోలీసులు కోరారు.


## పోలీసుల్లో క్రమశిక్షణను పెంపొందించడం... విధి నిర్వహణలో మరింత సమర్ధతను తీసుకురావడానికి పరేడ్ ప్రాక్టీస్

- జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ IPS ఆదేశాల మేరకు ఏ.ఆర్ పోలీసుల పరేడ్ సాధన
- పరేడ్ ను పర్యవేక్షించిన అనంతపురం ఏ.ఆర్ అదనపు ఎస్పీ





అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, ఏప్రిల్ 24 :



అనంతపురం ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ (A.R) విభాగంలో శుక్రవారం స్టాఫ్ పరేడ్ పురస్కరించుకుని స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఏ.ఆర్ సిబ్బందికి సెరిమోనియల్ పరేడ్ ప్రాక్టీస్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్, ఖూా ఆదేశాల మేరకు... ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా పరేడ్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఆర్ సిబ్బంది శ్రద్ధగా పాల్గొని పరేడ్ విధానాలు, క్రమశిక్షణ, అడుగుల సరళి మరియు ఆదేశాలకు అనుగుణంగా కదలికలను సాధన చేశారు. అలాగే పోలీస్ జాగిలాల విన్యాసాలకు సంబంధించి ప్రత్యేక సాధన కూడా నిర్వహించారు. ఈ ప్రాక్టీస్ ద్వారా సిబ్బందిలో శారీరక దృఢత్వం, సమన్వయం మరియు సేవా నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని ఏ.ఆర్ అదనపు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ ఐ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt)APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur . ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell : 6303427710